www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
02 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 237

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## నిమ్స్‌లో ఈహెచ్‌ఎస్ కౌంటర్లు కట్!

- ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి
- కాంట్రిబ్యూషన్‌పై ఉద్యోగుల ప్రశ్నలు
- కొత్త ఈహెచ్‌ఎస్ అమలుకు సన్నాహాలు
- ఆగస్టు 22 నుంచి క్యాష్‌లెస్ చికిత్స
- కార్పొరేట్ ఆసుపత్రుల సహకారంతో కొత్త విధానం

నిమ్స్‌లో 10 ఈహెచ్‌ఎస్ కౌంటర్లు తొలగింపు

03

# కాంగ్రెస్‌పై తీవ్ర అసంతృప్తి..
# వచ్చేది బీఆర్‌ఎస్సే!

కేసీఆర్ జనంలోకి రావాలని బీఆర్‌ఎస్‌కు సూచన

- చాణక్య సర్వేలో బీఆర్‌ఎస్‌కు 40.7 శాతం మద్దతు
- కాంగ్రెస్ గ్రాఫ్ 39.4 నుంచి 37.1 శాతానికి పతనం
- బీజేపీ ఓటు శాతంలో స్వల్ప పెరుగుదల
- జెన్ జీ ఓటర్లలో కాంగ్రెస్‌పై అసంతృప్తి
- ఎన్నికలకు రెండేళ్లు ఉండటంతో మారనున్న సమీకరణాలు

తెలంగాణ రాజకీయాల్లో యువ ఓటర్ల తీర్పు కీలకంగా మారుతున్న వేళ చాణక్య స్ట్రాటెజీస్ సర్వే ఆసక్తికర అంచనాలను వెల్లడించింది. కాంగ్రెస్ పాలనకు వెయ్యి రోజులు పూర్తైన సందర్భంగా జూలై నుంచి ఆగస్టు మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఈ అధ్యయనం నిర్వహించినట్లు సంస్థ తెలిపింది. ప్రతి నియోజకవర్గంలో 800 నుంచి 1000 మందితో మాట్లాడి మొత్తం 1,06,820 శాంపుల్స్ సేకరించినట్లు పేర్కొంది. గ్రామపంచాయితీ స్థాయిలోనూ 10 నుంచి 20 మందిని సంప్రదించినట్లు వివరించింది. సర్వే ప్రకారం కాంగ్రెస్ కు 37.1 శాతం, బీఆర్ఎస్ కు 40.7 శాతం, బీజేపీకి 14.1 శాతం మద్దతు కనిపించింది. 8.1 శాతం మంది ఎటువైపు మొగ్గు చూపలేదని నివేదిక తెలిపింది. 2023తో పోలిస్తే కాంగ్రెస్ గ్రాఫ్ 2.3 శాతం తగ్గగా, బీఆర్ఎస్ 3.4 శాతం పెరిగిందని పేర్కొంది. బీజేపీలో మాత్రం స్వల్ప మార్పే నమోదైంది. ఈ గణాంకాలు ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణాన్ని సూచిస్తున్నాయని సంస్థ వెల్లడించింది. ఎన్నికల సమయానికి యువత అభిప్రాయాలు ఏ దిశలో మారతాయో చూడాలి.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సర్వేలో జెన్ జీ ఓటర్ల అంశం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. రాష్ట్రంలోని 18 నుంచి 29 ఏళ్ల వయసు ఓటర్లు 22.97 శాతం ఉన్నారని 2023 ఎన్నికల గణాంకాలను నివేదిక ప్రస్తావించింది. ఈ వర్గం నిర్ణయం సాధారణంగా ఒకవైపు బలంగా ఉంటుందని సంస్థ అంచనా వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో యువతలో కాంగ్రెస్ పట్ల తీవ్ర అసంతృప్తి కనిపిస్తోందని సర్వే పేర్కొంది. ఎన్నికల హామీల అమలులో జాప్యం, స్థానిక సంస్థల పాలనలో కొత్త మార్పులు కనిపించకపోవడం ప్రతికూలతకు కారణాలుగా చెప్పింది. 2023లో కాంగ్రెస్ కు 39.4 శాతం ఓట్లు రాగా, తాజా సర్వేలో 37.1 శాతానికి పడిపోయినట్లు వివరించింది. ముఖ్యంగా పెన్షన్ హామీపై ఆలస్యం యువ ఓటర్లలో అసంతృప్తిని పెంచినట్లు నివేదిక అభిప్రాయపడింది. వచ్చే రెండేళ్లలో పరిస్థితిని మార్చుకునే అవకాశం కాంగ్రెస్ కు ఉందని సంస్థ పేర్కొంది. అయితే ప్రస్తుత ధోరణి అధికార పార్టీకి హెచ్చరికగా కనిపిస్తోందని విశ్లేషించింది. యువత సమస్యలపై పార్టీల స్పందన కీలకం కానుంది. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, విద్య అంశాలు నిర్ణయాత్మకంగా మారనున్నాయి.

మిగతా 2లో..

## మాస్టర్ స్ట్రోకా? బూమరాంగా?

- అసెంబ్లీ హాజరుపై రాజకీయ దుమారం
- 'వెయ్యి రోజులు'పై కాంగ్రెస్ కొత్త నరేటివ్
- కేసీఆర్‌ను డిఫెన్స్‌లోకి నెట్టే రేవంత్ వ్యూహం
- సభకు వస్తే బీఆర్‌ఎస్‌కు ఎదురుదాడి అవకాశం
- రాజీనామా అస్త్రం బూమరాంగ్ అవుతుందా?

కేసీఆర్ రాజీనామాకు రేవంత్ రెడ్డి డిమాండ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ హాజరును రాజకీయ అంశంగా మార్చారు. సభకు రాని ప్రతిపక్ష నేత పదవిలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నిస్తూ రాజీనామా డిమాండ్ తెరపైకి తెచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ సమావేశాలకు హాజరై పదేళ్ల పాలన, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధం కావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. దీంతో రాజీనామా చేస్తారా అన్న ప్రశ్న కంటే, రేవంత్ విసిరిన రాజకీయ అస్త్రం కాంగ్రెస్‌కు మాస్టర్ స్ట్రోక్ అవుతుందా,

మిగతా 2లో..

## పేదవాడి గుండె చప్పుడు వైఎస్ఆర్!



- 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మృతి
- పులివెందుల నుంచి రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదుగుదల
- 2003లో పాదయాత్ర ద్వారా ప్రజలకు మరింత చేరువ
- 2004లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్సార్
- ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు

03



## కాంగ్రెస్‌ను ఓడించాల్సిందే

- రామచందర్‌రావు హౌస్ అరెస్ట్
- నల్లగొండ పర్యటనకు పోలీసుల అడ్డంకి
- బీజేపీ నేతకు పరామర్శకు వెళ్లిన వేళ అరెస్ట్
- నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడి

02

## క్లైమాక్స్‌కు కొండా ఎపిసోడ్

- ఢిల్లీకి క్యూ కట్టిన తెలంగాణ నేతలు
- రేవంత్-వేణుగోపాల్ కీలక భేటీ
- కొండా సురేఖ ఎపిసోడ్‌పై ఉత్కంఠ
- కేబినెట్ ప్రక్షాళనపై చర్చ
- రాజగోపాల్ రెడ్డి భేటీపై ఆసక్తి
- అధిష్టానం నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కొండా సురేఖ ఎపిసోడ్ క్లైమాక్స్‌కు చేరుతుండటంతో తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ పెరుగుతోంది. తాజాగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్, స్పీకర్ గడ్డం ప్రసాద్ సహా పలువురు కీలక నేతలు ఢిల్లీ బాట పట్టారు. హైకమాండ్ పెద్దలను కలిసేందుకు నేతలు వరుసగా హస్తిన చేరుతున్నారు. కొండా సురేఖ కేసీ వేణుగోపాల్‌తో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా వేణుగోపాల్‌ను కలిసే అవకాశం ఉందని

మిగతా 2లో..

## రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల కన్నీళ్లు!

- ఆర్టీసీకి రూ.2,607.40 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయి
- ఉచిత ప్రయాణాల టికెట్ విలువ రూ.11,707.09 కోట్లు
- ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం రూ.9,099.69 కోట్లు
- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రూ.1,771.88 కోట్లు పెండింగ్
- 139 మందికి పైగా మాజీ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు
- నెలకు రూ.400 కోట్లు విడుదల చేయాలని ఎండీ లేఖ

03





## కేటీఆర్ రైతు సదస్సుకు అనుమతి నిరాకరణ

- పోలీసుల తీరుపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్
- సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌ను కేటీఆర్ రైతు సదస్సుకు ఏ ప్రాతిపదికన వర్తింపజేస్తారని ప్రశ్న
- ప్రతిపక్షాలను అడ్డుకోవడం సరికాదని హితవు

02

## నీట్ నిరసనకారులపై కేసుల కొట్టివేత

- ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు రద్దు
- ఆత్మహత్య బాధిత కుటుంబాలకు 3 నెలల్లోనే పరిహారం
- జూలై 20-25 నిరసనల్లో పాల్గొన్నవారిపై భవిష్యత్‌లోనూ కేసులొద్దు
- యువత భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని నిర్ణయం
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- 2,873 మందికి లభించని ఉపశమనం
- సెప్టెంబర్ 5 మార్చ్ ఉపసంహరణ: సుప్రీంకోర్టు

02



## స్టూడెంట్స్ భవిష్యత్తు బలి!

- సిద్దిపేటలో విద్యార్థుల సర్టిఫికెట్ల సమస్య
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన
- సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీ యాజమాన్యం
- హరీశ్ రావు తీవ్ర విమర్శలు
- సీఎం రేవంత్‌పై హరీశ్ రావు విమర్శలు
- విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్

03



# కాంగ్రెస్‌ను ఓడించాల్సిందే

- రామచందర్‌రావు హౌస్ అరెస్ట్
- నల్లగొండ పర్యటనకు పోలీసుల అడ్డంకి
- బీజేపీ నేతకు పరామర్శకు వెళ్లిన వేళ అరెస్ట్
- నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఆగ్రహం
- ప్రజాస్వామ్య పరిరక్షణపై రామచందర్‌రావు వ్యాఖ్యలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డిని పరామర్శించేందుకు తార్నాక నుంచి బయలుదేరిన ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని రామచందర్‌రావు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి వాతావరణాన్ని సృష్టించి భారతీయ జనతా పార్టీని రెచ్చగొడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజాస్వామ్యం కూడా ఖూనీ అయిపోయిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కాంగ్రెస్ పార్టీని ఓడించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పోలీసుల చర్యలపై బీజేపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. తార్నాకలోని రామచందర్‌రావు నివాసం వద్ద మంగళవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు భారీగా మోహరించారు. ఆయన నల్లగొండ జిల్లా పర్యటనకు వెళ్లకుండా అడ్డుకునే చర్యల్లో భాగంగా ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిస్థితిని గమనించిన బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. దీంతో అక్కడ రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. కొంతసేపటి తర్వాత రామచందర్‌రావు తన ఇంటి నుంచి నల్లగొండ వెళ్లేందుకు బయలుదేరారు. ఉదయం సుమారు పది గంటల సమయంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తన పార్టీ నేతను పరామర్శించేందుకు వెళ్లడాన్ని కూడా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని రామచందర్‌రావు అభిప్రాయపడ్డారు. పోలీసుల చర్యతో బీజేపీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఇప్పటికే రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు తీవ్రంగా సాగుతున్న నేపథ్యంలో ఈ అరెస్టు వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మొత్తం పరిణామానికి నల్లగొండలో జరిగిన ఘటన ప్రధాన కారణంగా మారింది. నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై సోమవారం సాయంత్రం కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని బీజేపీ ఆరోపించింది. వర్షిత్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించిన కాంగ్రెస్ కార్యకర్తలు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని, కిటికీల అద్దాలను పగులగొట్టారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కుటుంబ సభ్యులపై కూడా దాడి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో వర్షిత్‌రెడ్డి తల్లికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ఈ దాడి నేపథ్యంలో వర్షిత్‌రెడ్డిని పరామర్శించేందుకు రామచందర్‌రావు నల్లగొండకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే పోలీసులు ఆయన పర్యటనను అడ్డుకున్నారు. దీంతో దాడి ఘటన కంటే పోలీసుల నిర్బంధం ఇప్పుడు రాజకీయంగా మరింత చర్చనీయాంశంగా మారింది. బీజేపీ నేతలు దీనిని తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతల స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి వెనుక రాజకీయ ప్రతీకార కోణం ఉందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యాలయంపై బీజేపీ దాడి చేసిన ఘటన అనంతరం కాంగ్రెస్ శ్రేణులు ప్రతిదాడికి పాల్పడ్డాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు ఘటనలు రాష్ట్ర రాజకీయాల్లో పరస్పర ఆరోపణలకు దారితీశాయి. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఇళ్లపై దాడులు, ఆస్తుల ధ్వంసం, కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు తమపై వచ్చిన ఆరోపణలపై భిన్నమైన వాదనలు వినిపించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పోలీసులు చేపట్టిన చర్యలు, దాడి ఘటనపై దర్యాప్తు కీలకంగా మారింది. అసలు దాడికి కారణాలు ఏంటి, ఘటనలో ఎవరి పాత్ర ఎంతవరకు ఉందనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇరుపార్టీల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం కనిపిస్తోంది. రామచందర్‌రావు అరెస్టుతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోరు తెరపైకి వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీని రెచ్చగొడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని రక్షించగలమన్న ఆయన వ్యాఖ్యలు రాబోయే రాజకీయ పోరాటానికి సంకేతాలుగా బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. మరోవైపు అధికార పార్టీ ఈ ఆరోపణలకు ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. నల్లగొండ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. రాజకీయ విభేదాలు హింసాత్మక ఘటనలకు దారితీయకుండా ఇరుపార్టీలు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో నిరసనలకు, రాజకీయ విమర్శలకు స్థానం ఉన్నప్పటికీ చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు చోటు ఉండకూడదు. తాజా పరిణామాలతో తెలంగాణ రాజకీయాల్లో ఉద్రిక్తత మరింత పెరిగింది.

## నీట్ నిరసనకారులపై కేసుల కొట్టివేత

**న్యూఢిల్లీ:** నీట్ యూజీసీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా, విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో ఆందోళనలు చేపట్టిన సమయంలో నిరసనకారులపై నమోదైన కేసులన్నింటినీ సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి, జూలై 20 నుంచి 25 మధ్య కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనల్లో యువతపై దేశవ్యాప్తంగా నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తున్నట్టు అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు సీజేఐ సూర్యకాంత్ సారథ్యంలోని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నాటి నిరసనలకు సంబంధించి దేశంలో ఏ రాష్ట్రంలో, లేదా కేంద్రపాలిత ప్రాంతంలోనైనా నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణ లేకుండా క్లోజ్ చేసినట్లుగా పరిగణించాలని ఆదేశించింది. జూలై 20 నుంచి 26 మధ్య జరిగిన నిరసన ఘటనల ఆధారంగా భవిష్యత్తులో కూడా ఏ రాష్ట్రం, లేదా కేంద్రపాలిత ప్రాంతం విద్యార్థులపై లేదా ఆందోళనకారులపై ఎలాంటి కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. బీహార్, అసోం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాలు సమర్పించిన పిటిషన్లను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.



నీట్ 2026 పేపర్ లీక్, రద్దు వివాదాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల వ్యవధిలో పరిహారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. పరిహారం పంపిణీకి సంబంధించి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో చర్చించి ఒక జాతీయ స్థాయిలో ఒక శాశ్వత వ్యవస్థను రూపొందించాలని బెంచ్ స్పష్టం చేసింది.

**2,873 మందిపై కేసులు కంటిన్యూ:** ఆందోళనల్లో పాల్గొన్న సాధారణ యువతకు ఉపశమనం లభించినప్పటికీ, జంతర్ మంతర్ వద్ద తీవ్రమైన హింసాత్మక ఘటనలకు పాల్పడిన, అలాగే, తీవ్రమైన నేర చరిత్ర కలిగిన 2,873 మందిపై కేసులు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేసుల కొట్టివేత మినహాయింపు వారికి వర్తించదని క్లారిటీ ఇచ్చింది. ఢిల్లీ పోలీసులు వారిపై చట్టప్రకారం కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారించేందుకు అనుమతిస్తున్నట్టు తెలిపింది. బాధితులు తమ చట్టపరమైన హక్కులను వినియోగించుకోవచ్చని వెల్లడించింది. శాంతియుతంగా ఆందోళనల్లో పాల్గొన్న యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసుల ఎత్తివేత నిర్ణయం తీసుకున్నట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జూలై 25న నిరసనకారులకు ఇచ్చిన హామీకి కట్టుబడి కేంద్రంతో పాటు బిహార్, అసోం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్ఐఆర్‌ల రద్దు కోసం పిటిషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, ఇరు వర్గాలు నమ్మకంతో ఒకరితో ఒకరు మాట్లాడుకుంటే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు.

**సెప్టెంబర్ 5 మార్చ్ ఉపసంహరణ:** అత్యున్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం సానుకూల హామీలు, సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక నిర్ణయంతో, గతంలో తాము పిలుపునిచ్చిన సెప్టెంబర్ 5 నాటి ఢిల్లీ నిరసన మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ మంగళవారం ప్రకటించింది.

## కేటీఆర్ రైతు సదస్సుకు అనుమతి నిరాకరణ

**తెలంగాణ బ్యూరో:**

మిర్యాలగూడలో సెప్టెంబర్ 3న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించనున్న రైతు సదస్సుకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, పోలీసుల తీరుపై విమర్శలు చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లమోతు భాస్కర్ రావు రైతు సదస్సు నిర్వహణకు దరఖాస్తు చేయగానే డీఎస్పీ అనుమతిని తిరస్కరించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గతంలో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు సంబంధించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తాము స్వయంగా వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌ను నిర్వహిస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత నెలలో బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించి అనుమతి తెచ్చుకున్నామని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, పండగల ఊరేగింపుల సమయంలో విధించే సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌ను కేటీఆర్ నిర్వహించనున్న రైతు సదస్సుకు ఏ ప్రాతిపదికన వర్తింపజేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. డీజీపీ సీవీ ఆనంద్‌పై కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు చేశారు. డీజీపీ ఒక సెంచరీ కొట్టినందుకు చాలా సంతోషం. రేవంత్ రెడ్డి అక్రమ ఆదేశాలను అమలు చేయడంలో కూడా డీజీపీ డబుల్ సెంచరీ కొట్టేలా ఉన్నారు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2023 డిసెంబర్ 7 నుంచి అప్రకటిత కర్ఫ్యూ కొనసాగుతున్నట్లు ఆయన ఆరోపించారు. ఇటీవల పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడేందుకు వెళ్లాలనుకున్న హరీశ్ రావును హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు.

## కాంగ్రెస్‌పై తీవ్ర అసంతృప్తి..
# వచ్చేది బీఆర్ఎస్సే!

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ పరిస్థితిపై సర్వే కీలక వ్యాఖ్యలు చేసింది. 2023 ఎన్నికల్లో 37.3 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్ తాజా అంచనాల్లో 40.7 శాతానికి చేరినట్లు నివేదిక తెలిపింది. అంటే 3.4 శాతం పెరుగుదల నమోదైందని పేర్కొంది. కాంగ్రెస్ వ్యతిరేక ఓటర్లలో కొంత భాగం బీఆర్ఎ స్ వైపు చూస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి క్యాడర్ పునర్నిర్మాణం నెమ్మదిగా సాగడం పార్టీకి ప్రధాన అడ్డంకిగా ఉందని వివరించింది. గత ఎన్నికల్లో ఓటమి చెందిన పలువురు అభ్యర్థులే ఇంకా ఇన్‌చార్జిలుగా కొనసాగడం ప్రతికూల ప్రభావం చూపుతోందని సర్వే అభిప్రాయపడింది. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే పాత మద్దతు తిరిగి వచ్చే అవకాశముందని కొన్ని ప్రాంతాల్లో స్పందనలు వచ్చినట్లు తెలిపింది. బీఆర్ఎస్ సోషల్ మీడియా పనితీరు మెరుగుపడిందని, ప్రజల్లో పార్టీ గ్రాఫ్ పెరుగుతున్నా సంస్థాగత మార్పులు అత్యవసరమని నివేదిక సూచించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలోనూ రాకేశ్ రెడ్డి అభ్యర్థిత్వానికి అనుకూల వాతావరణం ఉందని పేర్కొంది. నియోజకవర్గాల నాయకత్వ మార్పులు పార్టీ భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చని నివేదిక పేర్కొంది. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్ బలపడుతున్నట్లు సర్వే అంచనా వేసింది. మేడ్చల్ మల్కాజిగిరి, సైబరాబాద్ ప్రాంతాల్లోని పలు డివిజన్లలో బీఆర్ఎస్ ముందంజలో ఉందని నివేదిక తెలిపింది. ఎల్బీనగర్ లో గతంలో బీజేపీ సాధించిన ఆధిక్యం ఈసారి కొనసాగకపోవచ్చని పేర్కొంది. మేడ్చల్ లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ కనిపిస్తుండగా, ఉప్పల్ లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ ఉందని వివరించింది. మల్కాజిగిరిలో మాత్రం త్రిముఖ పోటీ పరిస్థితి ఉందని తెలిపింది. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలంగా ఉందని సర్వే పేర్కొంది. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి పోటీ చేసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుంటే కాంగ్రెస్ కు ప్రయోజనం కలగవచ్చని అంచనా వేసింది. ఈ ప్రాంతాల ఫలితాలు స్థానిక రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల ఎంపికపై ఆధారపడతాయని నివేదిక సూచించింది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగర ఓటర్ల ధోరణిలో స్పష్టమైన తేడా కనిపిస్తోందని పేర్కొంది. ఈ అంచనాలు నగర రాజకీయాలపై ఆసక్తిని పెంచుతున్నాయి. అభివృద్ధి, మౌలిక



వసతులు, అభ్యర్థుల పనితీరు ఓటర్ల నిర్ణయంలో ప్రభావం చూపవచ్చని నివేదిక వివరించింది. బీజేపీకి తాజా సర్వేలో 14.1 శాతం మద్దతు కనిపించింది. 2023లో నమోదైన 13.9 శాతంతో పోలిస్తే కేవలం 0.2 శాతం పెరుగుదల మాత్రమే ఉందని నివేదిక తెలిపింది. యువతను ఆకట్టుకునే రాష్ట్రస్థాయి నాయకత్వం లేకపోవడం పార్టీకి ప్రతికూలంగా మారుతోందని విశ్లేషించింది. అయితే బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి ముఖంగా ప్రకటిస్తే కొన్ని నియోజకవర్గాల్లో అదనపు సీట్లు సాధించి కింగ్‌మేకర్ పాత్ర పోషించే అవకాశం ఉందని అంచనా వేసింది. కవిత కొత్త పార్టీపై కూడా ప్రజల్లో సందేహాలు ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం ఆ పార్టీకి గణనీయమైన మద్దతు కనిపించలేదని తెలిపింది.

# మాస్టర్ స్ట్రోకా? బూమరాంగా?

**మొదటిపేజీ తరువాయి**

బూమరాంగ్‌గా మారుతుందా అన్న చర్చ మొదలైంది. వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ విమర్శలకు కౌంటర్‌గా కేసీఆర్ గైర్హాజరును కాంగ్రెస్ ముందుకు తెస్తోంది. ఒకవైపు ప్రభుత్వ రిపోర్ట్ కార్డు, మరోవైపు ప్రతిపక్ష అటెండెన్స్ కార్డు అన్నట్టుగా ఈ రాజకీయం సాగుతోంది. ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వేదికపై ఆసక్తిని పెంచుతోంది. రేవంత్ వ్యూహంలో టైమింగ్ కీలకంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ తన వెయ్యి రోజుల పాలనను విజయాల మైలురాయిగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే, బీఆర్ఎస్ నెరవేరని హామీలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఇదే సమయంలో కేసీఆర్ బాధ్యతను రేవంత్ ప్రశ్నించారు. వెయ్యి రోజుల కాలంలో కేసీఆర్‌కు జీతంగా రూ.1.24 కోట్ల మేర చెల్లించారని, భద్రత, ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి రూ.21 కోట్ల మేర ఖర్చయిందని ఆయన ఆరోపించారు. ప్రజాధనం నుంచి సౌకర్యాలు పొందుతున్న ప్రతిపక్ష నేత సభకు వచ్చి ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నది రేవంత్ వాదన. దీని ద్వారా బీఆర్ఎస్ విమర్శల దిశను మార్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రభుత్వం సమాధానం చెప్పే స్థితి నుంచి ప్రతిపక్షం వివరణ ఇచ్చే స్థితికి చర్చను తీసుకెళ్లడమే లక్ష్యంగా కనిపిస్తోంది. కాంగ్రెస్‌కు ప్రయోజనం కూడా ఉంది. కేసీఆర్ గైర్హాజరును నిరసనల అంశంగా మార్చితే పార్టీ శ్రేణులకు క్షేత్రస్థాయిలో రాజకీయ కార్యక్రమం లభిస్తుంది. దీంతో పాలన చర్చకు ప్రతిపక్ష బాధ్యత అంశాన్ని జోడించే అవకాశం ఏర్పడింది. ఈ వ్యూహం రేవంత్‌కు మూడు రాజకీయ ప్రయోజనాలు అందించగలదు. మొదటిది, కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించడం. రెండోది, కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు సమాంతరంగా ప్రతిపక్ష పనితీరుపై చర్చ మొదలుపెట్టడం. మూడోది, కాంగ్రెస్ క్యాడర్‌కు స్పష్టమైన అంశం ఇచ్చి క్షేత్రస్థాయి రాజకీయ చురుకుదనాన్ని పెంచడం. అయితే



ఇదే వ్యూహంలో రిస్క్ కూడా ఉంది. కేసీఆర్‌ను ఎంతగా టార్గెట్ చేస్తే, అంతగా ఆయన రాజకీయ ప్రాధాన్యత చర్చలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి స్థాయి నుంచి కేసీఆర్‌పై వరుస దాడులు కొనసాగితే, కాంగ్రెస్‌కు ఇప్పటికీ ప్రధాన ప్రత్యర్థి కేసీఆరే అన్న భావన బలపడవచ్చు. ఈ పరిస్థితిని బీఆర్ఎస్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశం ఉంది. అధికారం కోల్పోయిన పార్టీకి క్యాడర్‌లో పోరాట స్ఫూర్తి నిలబెట్టడం కీలకం. అధికార పార్టీ ముఖ్యమంత్రి తమ అధినేతను కేంద్రంగా చేసుకుని రాజకీయ విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రచారం చేయవచ్చు. దీంతో కేసీఆర్‌ను డిఫెన్స్‌లోకి నెట్టాలన్న కాంగ్రెస్ ప్రయత్నం, అనుకోకుండా ఆయన స్థాయిని మరోసారి హైలైట్ చేసే పరిస్థితిని సృష్టించవచ్చు. సవాల్ ఇదే. డైలమా కేసీఆర్ ముందుంది. రేవంత్ సవాల్‌పై స్పందించకుండా అసెంబ్లీకి దూరంగా ఉంటే, కాంగ్రెస్‌కు ప్రశ్న దొరుకుతుంది. ప్రతి సమావేశం సమయంలో ప్రతిపక్ష నేత ఎందుకు సభకు రావడం లేదన్న అంశాన్ని లేవనెత్తవచ్చు. మరోవైపు కేసీఆర్ సభకు వస్తే పరిస్థితి మారవచ్చు. అప్పుడు చర్చ అటెండెన్స్ నుంచి ప్రభుత్వ పనితీరుపైకి మళ్లే అవకాశం ఉంటుంది. ఉద్యోగాలు, రైతులు, సంక్షేమ హామీలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, హైదరాబాద్ అభివృద్ధి వంటి అంశాలపై కేసీఆర్ ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. సుదీర్ఘ పరిపాలనా అనుభవంతో ఆయన చర్చను తనకు అనుకూలమైన అంశాల వైపు మళ్లిస్తే బీఆర్ఎస్‌కు కొత్త ఊపు రావచ్చు. అందుకే కేసీఆర్ నిర్ణయం కేవలం హాజరుపై తీసుకునే నిర్ణయం కాదు. రేవంత్ ప్రారంభించిన రాజకీయ ఎపిసోడ్ తదుపరి దిశను నిర్ణయించే అడుగు అవుతుంది. రాజీనామా డిమాండ్ కూడా ఇదే వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. అసలు లక్ష్యం రాజీనామా సాధించడం కంటే ప్రతిపక్ష నేత బాధ్యతపై ప్రశ్నను ప్రజల్లో నిలబెట్టడమే కావచ్చు. అదే సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును ముందుకు తెస్తోంది. రేవంత్ సవాల్ మాస్టర్ స్ట్రోక్ అవుతుందా అన్నది ఇప్పుడే తేల్చలేం. కేసీఆర్ సభకు రాకపోతే కాంగ్రెస్ అటెండెన్స్ నెరేటివ్‌ను కొనసాగించగలదు. సభకు వస్తే బీఆర్ఎస్ పెర్ఫార్మెన్స్ నెరేటివ్‌ను ముందుకు తీసుకెళ్లగలదు. అంటే రెండు మార్గాల్లోనూ రాజకీయ లాభనష్టాలు ఉన్నాయి. గతంలోనూ రాజీనామా సవాల్ కేసీఆర్ రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా మారింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నేత ఎం. సత్యనారాయణ రావు సవాల్‌ను స్వీకరించిన కేసీఆర్ కరీంనగర్ ఎంపీ పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికలో భారీ మెజార్టీతో గెలిచారు. ఆ విజయం ఉద్యమానికి మరింత ఊపునిచ్చింది. రేవంత్ విసిరిన రాజీనామా పాచిక ఏ ఫలితం ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కేసీఆర్‌ను రాజకీయంగా ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రారంభమైన ఈ ఎపిసోడ్, తెలంగాణ చర్చను మళ్లీ ఆయన చుట్టూ తిప్పితే కాంగ్రెస్‌కే చిక్కు ఎదురవుతుంది. ప్రస్తుతానికి అజెండాను రేవంత్ సెట్ చేశారు. బంతి కేసీఆర్ కోర్టులో ఉంది. ఆయన తీసుకునే నిర్ణయమే తదుపరి రాజకీయ దిశను నిర్ణయించనుంది. రాజీనామా రాజకీయం ఎవరికి లాభమో అసెంబ్లీ సమావేశాలే తేల్చనున్నాయి.

## విద్యార్థినుల కోసం మూడేళ్ల కెరీర్ రెడీనెస్ కార్యక్రమం!

**పాల్వంచ విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ మరియు లాంచ్ గర్ల్స్ సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలోని 43 ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మరియు అటానమస్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినుల కోసం మూడేళ్ల కెరీర్ రెడీనెస్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని లాంచ్ గర్ల్స్ ప్రోగ్రామ్ అసోసియేట్ ప్రియాంక విద్యార్థినులకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా. జె. మాధవి సమన్వయం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు మొదటి సంవత్సరం నుంచే కెరీర్‌పై అవగాహన కల్పించి, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి వంటి రంగాల్లో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం విద్యార్థినులతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందులో ఆత్మవిశ్వాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అవగాహన, డిజిటల్ లిటరసీ, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన నైపుణ్యాలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, భవిష్యత్ కెరీర్‌కు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలను అందించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన నిపుణుల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.కెరీర్ రెడీనెస్ కార్యక్రమ ఫ్యాకల్టీ సభ్యులు డా. ఎన్. శ్రీదేవి, శ్రీమతి ఎస్. విమల, శ్రీమతి ఎ. హారిక, శ్రీమతి కరీమా తబస్సుమ్ కార్యక్రమ నిర్వహణలో సహకరించారు.




# క్లైమాక్స్‌కు కొండా ఎపిసోడ్

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తి మొదలైంది. ఇప్పటికే సురేఖ వ్యవహారం పార్టీలో చర్చకు దారితీయగా, నేతల మధ్య సమన్వయం అంశం కూడా హైకమాండ్ దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ భేటీల ఫలితంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధిష్టానం నుంచి వచ్చే సంకేతాలను రాష్ట్ర నేతలు నిశితంగా గమనిస్తున్నారు. కేబినెట్‌లో మార్పులు ఉంటాయా, కొందరు మంత్రులకు ఉద్వాసన తప్పదా అనే చర్చ ఇప్పుడు జోరందుకుంది. కొండా సురేఖ ఎపిసోడ్‌తో పాటు చిన్నారెడ్డి వ్యవహారం కూడా అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వివాదాలకు ముగింపు పలికి ప్రభుత్వ పనితీరుపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లి కేసీ వేణుగోపాల్‌తో కీలకంగా భేటీ కావడం ఈ చర్చలకు మరింత బలం చేకూర్చింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరు, నేతల మధ్య సమన్వయం వంటి అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. మంత్రివర్గ ప్రక్షాళనపై కూడా అభిప్రాయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.



అయితే తుది నిర్ణయం కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో చర్చల అనంతరం వెలువడే అవకాశం ఉంది. దీంతో ప్రతి భేటీపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ క్రమశిక్షణ విషయంలో అధిష్టానం కఠినంగా వ్యవహరిస్తుందా అనే ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడేందుకు చర్యలు అవసరమనే అభిప్రాయం ఉంది. రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్లకు పైగా సమయం పూర్తవుతున్న నేపథ్యంలో పాలన, పార్టీ బలోపేతం అంశాలపై అధిష్టానం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వివాదాస్పద అంశాలు పదేపదే తెరపైకి రావడం పార్టీ ప్రతిష్ఠపై ప్రభావం చూపకుండా చూడాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయా, వివాదానికి రాజకీయ పరిష్కారం ఎలా చూపాలి అనే అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. మరోవైపు చిన్నారెడ్డి ఎపిసోడ్‌లో నేతల మధ్య విభేదాలను తగ్గించేందుకు సమన్వయ ప్రయత్నాలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో భవిష్యత్ వ్యూహం, జిల్లాల వారీగా పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచే చర్యలపైనా చర్చ జరిగే అవకాశముంది. ఈ పరిణామాలు మంత్రివర్గ భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. అందుకే ఢిల్లీ సమావేశాలు కీలకంగా మారాయి. ఈ పరిణామాలపై అధిష్టానం లోతుగా సమీక్షించే అవకాశం ఉంది. ఇప్పటివరకు కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్టానం నుంచి స్పష్టమైన నిర్ణయం బయటకు రాలేదు. అయితే వరుసగా కీలక నేతలు ఢిల్లీకి చేరుకోవడంతో త్వరలోనే ఒక నిర్ణయం వెలువడే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సురేఖను కొనసాగిస్తారా, బాధ్యతల నుంచి తప్పిస్తారా, లేక వివాదాన్ని అంతర్గత చర్చలతో ముగిస్తారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో మంత్రివర్గంలో ఖాళీలు, శాఖల మార్పులు, కొత్త ముఖాలకు అవకాశం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి తన ప్రభుత్వంపై ప్రభావం చూపే నిర్ణయాల విషయంలో అధిష్టానంతో సమన్వయం చేసుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజగోపాల్ రెడ్డి వేణుగోపాల్‌ను కలిస్తే ఆయన అభిప్రాయాలు కూడా చర్చలోకి రావచ్చని తెలుస్తోంది. దీంతో ఢిల్లీ పర్యటనలు సాధారణ భేటీలకే పరిమితమా, లేక కీలక నిర్ణయాలకు దారితీస్తాయా అనే ఆసక్తి పెరిగింది. కాంగ్రెస్‌లో ప్రతి పరిణామం ఇప్పుడు రాజకీయ చర్చగా మారుతోంది. ప్రస్తుత పరిణామాలు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిణామాలకు ఢిల్లీ సమావేశాలు ముగింపు పలుకుతాయా అనేది ఆసక్తికరంగా మారింది. అధిష్టానం నిర్ణయం వెలువడితే కొండా సురేఖ ఎపిసోడ్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో కేబినెట్ ప్రక్షాళనపై కూడా సంకేతాలు బయటపడే అవకాశం కనిపిస్తోంది. పార్టీ అంతర్గత విభేదాలను తగ్గించడం, నేతల మధ్య సమన్వయం పెంచడం, ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడం హైకమాండ్ ముందున్న ప్రధాన లక్ష్యాలుగా భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి సమావేశం తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు బాట పడుతుందా అనే చర్చ మొదలైంది. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న అంశాలు ఎక్కువగా రాజకీయ వర్గాల అంచనాలకే పరిమితమయ్యాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఎవరిపై చర్యలు ఉంటాయో చెప్పడం కష్టం. అయినా ఢిల్లీకి చేరిన నేతల సంఖ్య, వరుస భేటీలు చూస్తే కాంగ్రెస్‌లో కీలక నిర్ణయాల సమయం దగ్గరపడినట్లు స్పష్టమవుతోంది.

# రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల కన్నీళ్లు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఆర్టీసీలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఏళ్ల తరబడి సంస్థకు సేవలందించిన వారికి దక్కాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, వేతన సవరణ బకాయిలు ఇంకా చెల్లించలేదు. ఈ బకాయిల మొత్తం రూ.1,771.88 కోట్లకు చేరినట్లు ఆర్టీసీ ఎండీ ప్రభుత్వానికి రాసిన అధికారిక లేఖలో పేర్కొన్నారు. నిధుల కొరత కారణంగా చెల్లింపులు నిలిచిపోయాయని యాజమాన్యం స్పష్టం చేసింది. కొందరు రిటైర్డ్ ఉద్యోగులు తమ హక్కుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. జీవితాంతం సేవ చేసిన తరువాత సొంత డబ్బు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా గ్రాట్యుటీ అందకుండానే పలువురు మరణిస్తున్నారని లేఖలోని వ్యాఖ్యలు పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తున్నాయి. ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ అంశం రాజకీయ విమర్శలకు కారణమవుతోంది. సేవా కాలంలో ఇచ్చిన హామీలు పదవీ విరమణ తర్వాత అమలుకావాలని బాధితులు కోరుతున్నారు. ఈ పరిణామాలపై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ఈ సమస్యపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆగస్టు 3న రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ పంపారు. No.B&F/F2/52(2)/202627FD నంబరుతో ఉన్న ఈ లేఖలో సంస్థ ఎదుర్కొంటున్న నగదు కొరతను వివరించారు. 2023 డిసెంబర్ 9 నుంచి 2026 జూలై 31 వరకు మహిళలకు ఉచిత ప్రయాణాల టికెట్ విలువ రూ.11,707.09 కోట్లు కాగా, ప్రభుత్వం రూ.9,099.69 కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. దీంతో రూ.2,607.40 కోట్ల బకాయి




ఏర్పడింది. 202324లో రూ.118.07 కోట్లు, 202425లో రూ.506.49 కోట్లు, 202526లో రూ.904.81 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2026 27లో జూలై వరకు మరో రూ.1,078.03 కోట్ల బకాయి పేరుకుపోయింది. ఈ వ్యత్యాసం ఆర్టీసీ ఆర్థిక స్థితిపై ఒత్తిడిని పెంచుతోంది. ఈ మొత్తం విడుదలలోనే ఆలస్యం కొనసాగితే బకాయిల భారం మరింత పెరిగే అవకాశం ఉంది. ఉచిత ప్రయాణ పథకానికి ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్మును నిర్ణీత కాలవ్యవధిలో విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. అప్పుడే సంస్థ నగదు ప్రవాహం మెరుగుపడుతుంది. త్వరగా నిధులు విడుదల చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సభల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకానికి ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా చెల్లించిందని చెబుతున్నారు. అయితే ఆర్టీసీ ఎండీ లేఖలో కనిపిస్తున్న అధికారిక లెక్కలు మరో చిత్రాన్ని చూపిస్తున్నాయి. సంస్థకు వాస్తవంగా విడుదలైన మొత్తం రూ.9,099.69 కోట్లుగా లేఖలో ఉంది. మహిళలు ప్రయాణించిన ఉచిత టికెట్ల మొత్తం విలువ రూ.11,707.09 కోట్లు కావడంతో, సీఎం ప్రస్తావించిన సంఖ్య ఆ మొత్తానికి దగ్గరగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ప్రకటనలు, ఆర్టీసీ లెక్కల మధ్య ఉన్న వ్యత్యాసం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రజలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న పథకానికి అవసరమైన నిధులు సకాలంలో రాకపోతే సంస్థ నిర్వహణపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ లెక్కలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. ఆర్టీసీపై ఆర్థిక ఒత్తిడి కూడా పెరిగింది. ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ సాయం, రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు సమన్వయంగా ఉంటే సంస్థకు కొంత ఉపశమనం లభిస్తుంది. లేనిపక్షంలో భవిష్యత్తులో మరిన్ని బకాయిలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. సర్కార్ వెంటనే స్పందించాలి. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో ఆర్‌పీఎస్2017కు సంబంధించి రూ.1,251 కోట్లు, గ్రాట్యుటీ, టీఎల్ఈ వ్యత్యాసాల కింద రూ.312 కోట్లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.135.02 కోట్లు, 2026 ఫిబ్రవరి నుంచి జూన్ వరకు తాజా గ్రాట్యుటీగా రూ.73.86 కోట్లు ఉన్నట్లు లేఖ వెల్లడించింది. మొత్తం రూ.1,771.88 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఆర్‌పీఎస్2013, 2017, 2021 వేతన సవరణ వివరాలు పీఎఫ్ అధికారులకు సమర్పించకపోవడంతో కొందరి ప్రయోజనాలు కూడా నిలిచిపోయాయని పేర్కొన్నారు. 139 మందికి పైగా మాజీ ఉద్యోగులు WP No.23771/2026, 23899/2026 తదితర కేసులతో హైకోర్టును ఆశ్రయించారు. తమకు రావాల్సిన సొమ్ము కోసం కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడటం ప్రభుత్వానికి ఇబ్బందికర ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం అవసరమవుతోంది. ఆ సొమ్ము ఆలస్యం కావడంతో వారి ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. కోర్టు కేసులు పెరగకముందే పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ బకాయిల పరిష్కారం ఆలస్యం అయితే ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతుంది. వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీకి ప్రభుత్వం నెలకు రూ.300 కోట్ల బడ్జెట్ సాయం అందిస్తోంది. పెరుగుతున్న ఉచిత ప్రయాణ భారం, సంస్థ నిర్వహణ అవసరాలకు ఈ మొత్తం సరిపోవడం లేదని ఎండీ లేఖలో వివరించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తీర్చేందుకు అదనంగా రూ.100 కోట్లు కలిపి నెలకు మొత్తం రూ.400 కోట్లు విడుదల చేయాలని కోరారు. గతంలో 2026 ఫిబ్రవరి, మార్చి నెలలకు ప్రత్యేకంగా రూ.500 కోట్లు ఇవ్వాలని కోరినా స్పందన రాలేదని తెలిపారు. ఇప్పుడు అసలు ప్రశ్న ఆర్టీసీకి రావాల్సిన రూ.2,607.40 కోట్ల రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు విడుదలవుతుందన్నదే. మరోవైపు రూ.1,771.88 కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సి ఉంది. సీఎం ప్రకటనలు, అధికారిక లెక్కల మధ్య స్పష్టత తీసుకురావడంతో పాటు బకాయిల చెల్లింపులకు సమయపట్టిక ప్రకటించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. బకాయిలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తే ఉద్యోగుల్లో నమ్మకం పెరుగుతుంది. ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వానికి కూడా ఇది అవసరమైన చర్యగా మారింది. రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.

## కంబాలపెల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

### గర్భిణీలపై ప్రత్యేక నిఘా.. చిన్నారులకు సంపూర్ణ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలి



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి):** ఆశ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవిరాథోడ్ మంగళవారం కంబాలపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని హాజరు రికార్డులు, ఆశ కార్యకర్తల రికార్డులను పరిశీలించారు. గర్భిణీ స్త్రీల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదకర గర్భిణీలను గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా అందేలా చూడాలని ఆదేశించారు. 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ వ్యాధి నిరోధక టీకా అందించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే కొన్ని క్యాన్సర్ వ్యాధులను నివారించవచ్చని ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కాలానుగుణంగా ప్రబలే జ్వరాల నియంత్రణకు ఇంటింటి సర్వే నిర్వహించి బాధితులకు సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు లార్వాలను తొలగించడం, గ్రామపంచాయతీల సమన్వయంతో పరిసరాల పరిశుభ్రత పాటించడం, అవసరమైన చోట పిచికారీ కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించిన ఆయన, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. వీరజిత, డా. శివకుమార్, కంబాలపెల్లి పీహెచ్‌సీ వైద్యుడు డా. సుధీర్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం: నాగాసీతారాములు

**పాల్వంచ విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే పార్టీకి బలమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగాసీతారాములు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీ కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త షేక్ యాకూబ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయం కావడంతో ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. యాకూబ్ ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న నాగాసీతారాములు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన సమయంలో తమ సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ దంతెబోయిన నరేష్, ఉప సర్పంచ్ ఉబ్బన రాజు, గ్రామ పెద్దలు కడియాల సత్యనారాయణ, కోంపెల్లి వీరన్న, దయ్యాల సమ్మన్న, రావు మధు, ఓబీసీ జిల్లా సెక్రటరీ బొబ్బాల వెంకట్ యాదవ్, బొల్లం ఉదయ్ కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు వంశీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి గుండె చప్పుడు వైఎస్ఆర్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

2009 సెప్టెంబర్ 2.. తెలుగు నేల ఒక్కసారిగా మూగబోయిన రోజు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజల మధ్య తిరుగుతూ, రెండోసారి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వార్త రాష్ట్రాన్ని విషాదంలో ముంచెత్తింది. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన హెలికాప్టర్ నల్లమల అడవుల్లోని పావురాలగుట్ట ప్రాంతంలో కూలిపోవడంతో వైఎస్సార్‌తో పాటు మరో నలుగురు మరణించారు. గల్లంతైన హెలికాప్టర్ కోసం గంటల తరబడి సాగిన గాలింపు, టెలివిజన్ తెరల ముందు ప్రజల ఆందోళన, చివరకు మరణవార్త వెలువడిన క్షణం.. ఇవన్నీ తెలుగు ప్రజల మదిలో ఇప్పటికీ చెరగని జ్ఞాపకాలే. ఒక ముఖ్యమంత్రి మరణం మాత్రమే కాదు, కోట్లాది మందికి దగ్గరైన 'రాజన్న' హఠాత్తుగా దూరమైన రోజు అది. పావురాలగుట్ట వద్ద ఆగిపోయింది ఒక హెలికాప్టర్ ప్రయాణమే అయినా, ఆ క్షణంతో తెలుగు రాజకీయాల్లో ఒక భారీ అధ్యాయం ముగిసిపోయింది. అయితే వైఎస్సార్ భౌతికంగా దూరమైనా, ప్రజల జ్ఞాపకాల నుంచి మాత్రం చెరిగిపోలేదు. 1949 జూలై 8న జన్మించిన రాజశేఖరరెడ్డి ప్రయాణం మొదట రాజకీయాలతో ప్రారంభం కాలేదు. వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్‌గా సేవలందిస్తూ ప్రజల కష్టాలను దగ్గరగా చూశారు. ఆసుపత్రికి వచ్చే పేద కుటుంబాల బాధలు, వైద్యం కోసం పడుతున్న ఇబ్బందులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వెనుకబాటుతనం రాజకీయాలపై ప్రత్యేకమైన అవగాహనను పెంచాయి. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాలంటే వైద్య సేవలకు మించి విస్తృత స్థాయిలో పని చేయాలనే ఆలోచనతో ప్రజా జీవితంలో అడుగుపెట్టారు. 1978లో పులివెందుల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం రాజకీయ ప్రస్థానానికి తొలి పెద్ద మెట్టు.



అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసే పరిస్థితి రాలేదు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, పార్టీ నాయకుడిగా, ప్రతిపక్ష నేతగా ఎదుగుతూ చివరకు రాష్ట్ర అత్యున్నత పదవిని అందుకున్నారు. పులివెందుల నుంచి మొదలైన ఆ ప్రయాణం ఒక నియోజకవర్గ రాజకీయ నాయకుడి కథగా నిలవలేదు. క్రమంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా మారింది. రాజకీయాల్లో వైఎస్సార్ ప్రత్యేకత కేవలం ఎన్నికల్లో గెలవడంలోనే కనిపించలేదు. పార్టీ బలహీనంగా ఉన్న సమయంలో కూడా కార్యకర్తల్లో ధైర్యం నింపడం, ప్రత్యర్థులను ఎదుర్కొనే వ్యూహాలను రూపొందించడం, ప్రజల సమస్యలను రాజకీయ పోరాటంగా మార్చడం ఆ నాయకత్వంలోని ప్రధాన లక్షణాలు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌ను తీవ్రంగా దెబ్బతీసినా, పులివెందులలో వైఎస్సార్ రాజకీయ పట్టు మాత్రం నిలిచింది. రాష్ట్రంలో పరిస్థితులు మారినా, స్థానిక ప్రజలతో ఏర్పడిన బంధం చెక్కుచెదరలేదు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలు, సీనియర్ నేతల మధ్య పోటీ వంటి అనేక సవాళ్ల మధ్య తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించారు. పదవి కోసం మాత్రమే రాజకీయాలు చేయకుండా, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలనే ప్రయత్నం సాగించారు. ఓటమి వచ్చినప్పుడు నిరాశ చెందకుండా తదుపరి విజయానికి పునాది వేయడం, కార్యకర్తను కేంద్రంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రూపొందించడం వల్లే వైఎస్సార్ క్రమంగా రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. కాంగ్రెస్‌లోని అనేక తరాల నాయకులతో కలిసి పనిచేసిన ఈ నాయకుడు, చివరకు పార్టీకి తిరిగి అధికారం అందించే స్థాయికి చేరుకున్నారు. 1989లో కడప నుంచి లోక్‌సభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టినా, రాష్ట్ర రాజకీయాలపై పట్టు మాత్రం వదల్లేదు. ఢిల్లీలో ఎంపీగా పనిచేస్తూనే ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలను నిశితంగా గమనించారు. 1994లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్న తర్వాత కూడా రాజకీయ పోరాటం నుంచి వెనక్కి తగ్గలేదు. 1999 ఎన్నికల తర్వాత ప్రధాన ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టడం వైఎస్సార్ కెరీర్‌లో కీలక మలుపుగా మారింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బలమైన రాజకీయ శక్తిగా ఉన్న సమయంలో, ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని నిర్మించాల్సిన బాధ్యత వైఎస్సార్‌పై పడింది. రైతు సమస్యలు, కరువు, విద్యుత్ ఛార్జీలు, గ్రామీణ ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. కాంగ్రెస్‌ను కేవలం ప్రతిపక్ష పార్టీగా కాకుండా, అధికారానికి పోటీ ఇచ్చే శక్తిగా మలచేందుకు ప్రయత్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ నాయకులను సమన్వయం చేయడం, కార్యకర్తల్లో నమ్మకం పెంచడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం ద్వారా 2004 ఎన్నికలకు ముందే రాజకీయ వాతావరణాన్ని మార్చేశారు. ఆ మార్పుకు అసలు నాంది 2003లో ప్రారంభమైన ప్రజా ప్రస్థానం పాదయాత్ర. చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ మహా యాత్ర తెలుగు రాజకీయాల్లో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయింది.

# స్టూడెంట్స్ భవిష్యత్తు బలి!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సిద్దిపేటలోని శ్రీకృప ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ బి.ఫార్మసీ విద్యార్థులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20222026 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ, తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కాలేజీ యాజమాన్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందకపోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మిడిల్ క్లాస్ కుటుంబాల నుంచి వచ్చిన తాము కన్వీనర్ కోటాలో కాలేజీలో చేరామని వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఎం.ఫార్మసీ ప్రవేశాల కోసం కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతోంది. సర్టిఫికెట్లు లేకపోవడంతో మంచి కాలేజీల్లో వచ్చిన అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని విద్యార్థినులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వానికి, కాలేజీ యాజమాన్యానికి మధ్య ఉన్న సమస్యకు తమ భవిష్యత్తును బలిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్య త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు. విద్యార్థినులు తమ సమస్యను సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. హరీశ్ రావును ట్యాగ్ చేస్తూ ఒక వీడియోను షేర్ చేసిన విద్యార్థులు తమ పరిస్థితిని వివరించారు. ఎం.ఫార్మసీ ఫేజ్ 1 కౌన్సిలింగ్‌కు చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో సర్టిఫికెట్లు అందకపోవడం తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సర్టిఫికెట్లు లేకపోతే సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికే గ్రాడ్యుయేషన్ పూర్తయినప్పటికీ తదుపరి చదువులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ బకాయిల కారణంగా తమ చదువులు ఆగిపోవడం బాధాకరమని చెప్పారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో మానసిక ఒత్తిడి పెరుగుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తమ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. తమ భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



విద్యార్థుల వీడియోపై హరీశ్ రావు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న సమయంలో విద్యార్థులు రోడ్డున పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పలు ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువగా ఉందని విమర్శించారు. మైకు దొరికినప్పుడు ప్రతిపక్షాలను విమర్శించడంపై ఉన్న శ్రద్ధ, క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థుల గోడును ప్రభుత్వం తక్షణమే వినాలని కోరారు. వారి చదువులు కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం తెలంగాణలో విద్యార్థులకు కొత్త సమస్య కాదని హరీశ్ రావు తన విమర్శల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో కాలేజీలు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఆ ప్రభావం చివరకు విద్యార్థులపై పడుతోందని ఆయన ఆరోపించారు. సిద్దిపేటలో వెలుగులోకి వచ్చిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యకు ఒక ఉదాహరణ మాత్రమేనని అన్నారు. వేలాది మంది విద్యార్థులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఉన్నత విద్యే భవిష్యత్తును మార్చే మార్గమని, అలాంటి అవకాశాలను ప్రభుత్వ నిర్ణయాల కారణంగా కోల్పోయే పరిస్థితి రాకూడదని చెప్పారు. కాలేజీలు, విద్యార్థులు, ప్రభుత్వం మధ్య ఉన్న ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలింగ్ గడువులను దృష్టిలో పెట్టుకుని అత్యవసరంగా స్పందించాలని సూచించారు. ఆలస్యం జరిగితే విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం సిద్దిపేట విద్యార్థుల సమస్యపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నదే కీలకంగా మారింది. ఎం.ఫార్మసీ కౌన్సిలింగ్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందకపోతే వారి ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యం మధ్య చర్చలు జరిపి పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. హరీశ్ రావు చేసిన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి బకాయిల విడుదలకు చర్యలు చేపడుతుందా, విద్యార్థులకు తక్షణ ఉపశమనం కల్పిస్తుందా అనేది చూడాలి. ప్రస్తుతం విద్యార్థులు తమ చదువులు కొనసాగించేందుకు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం కుటుంబాలు ఆశగా చూస్తున్నాయి. సకాలంలో పరిష్కారం లభిస్తే విద్యార్థులు తదుపరి విద్యాభ్యాసాన్ని కొనసాగించే అవకాశం ఉంటుంది. లేదంటే కీలకమైన విద్యా సంవత్సరం నష్టపోయే ప్రమాదం కనిపిస్తోంది.

## సూర్యాపేట జిల్లాలో సెక్షన్ 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు

### కోదాడ డీఎస్పీ ఆర్. శ్రీనివాస్ రెడ్డి

**కోదాడ, (విశాలభారతి):** సూర్యాపేట జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత మరియు ప్రశాంత వాతావరణాన్ని కాపాడే ఉద్దేశంతో పోలీస్ యాక్ట్1861లోని సెక్షన్ 30 మరియు 30(ఎ)లను అమలు చేస్తున్నట్లు కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఉత్తర్వుల ప్రకారం.. ఈ నిబంధనలు సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కాలంలో జిల్లా పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు, ధర్నాలు, నిరాహార దీక్షలు లేదా ఇతర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలన్నా, మైకులు లేదా లౌడ్ స్పీకర్లు వినియోగించాలన్నా ముందస్తుగా జిల్లా ఎస్పీ గారి అనుమతి తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించరాదని భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిర్వాహకులు తమ కార్యక్రమాల వల్ల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పూర్తి బాధ్యత వహించాలని డీఎస్పీ సూచించారు.

# నిమ్స్‌లో ఈహెచ్ఎస్ కౌంటర్లు కట్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. అత్యుత్తమ వైద్య సేవలకు పేరున్న నిమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈహెచ్ఎస్‌కు సంబంధించిన కౌంటర్లను తొలగించడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు నిమ్స్‌లో ఈహెచ్ఎస్ సేవల కోసం మొత్తం పది కౌంటర్లు అందుబాటులో ఉండేవి. ఉద్యోగులు, పెన్షనర్లు తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి చేసుకునేందుకు ఈ కౌంటర్లు కీలకంగా ఉండేవి. ప్రస్తుతం అవి లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. తమ జీతాల నుంచి క్రమం తప్పకుండా కాంట్రిబ్యూషన్ చెల్లిస్తున్న సమయంలో సేవలకు సంబంధించిన కౌంటర్లను తొలగించడం సరైన నిర్ణయం కాదని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఈహెచ్ఎస్ సేవలు సులభంగా అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కొత్త విధానంలో డిజిటల్ ప్రక్రియలు ఉన్నా, ప్రత్యక్ష సహాయం అవసరమయ్యే ఉద్యోగులకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఉండాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త ఈహెచ్ఎస్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఆగస్టు 22 నుంచి కొత్త పథకం అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆగస్టు 22న సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ట్రస్ట్ బోర్డ్ కన్వీనర్, ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ అధ్యక్షతన జరిగిన సమావేశానికి టీజీ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌తో పాటు బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు హాజరయ్యారు. తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయడం, ఆస్పత్రుల్లో చికిత్స ప్రక్రియను సులభతరం చేయడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. కొత్త విధానంలో లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను తగ్గించే దిశగా మార్గదర్శకాలు రూపొందించారు. సమావేశానికి అపోలో, కాంటినెంటల్, యశోద, కిమ్స్ వంటి ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. చర్చల అనంతరం తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్‌తో పాటు ఆస్పత్రుల ప్రతినిధులు కొత్త ఈహెచ్ఎస్ పథకాన్ని తక్షణమే అమలు చేసేందుకు అంగీకరించారు. దీంతో అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత చికిత్స సదుపాయం అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈహెచ్ఎస్ కింద చికిత్స పొందడంలో ఎదురైన కొన్ని ఇబ్బందులను తగ్గించేందుకు కొత్త విధానంలో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆస్పత్రుల ఎంపానెల్‌మెంట్, చికిత్స ప్రోటోకాల్స్, క్లెయిమ్ సెటిల్‌మెంట్ వంటి అంశాలకు సంబంధించి సవరించిన మార్గదర్శకాలు విడుదలయ్యాయి. లబ్ధిదారులకు వేగంగా వైద్యం అందేలా ప్రక్రియను క్రమబద్ధీకరించడమే కొత్త మార్గదర్శకాల ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. పథకం అమలులో ఆస్పత్రులు సహకరించాలని ట్రస్ట్ కోరింది. కొత్త ఈహెచ్ఎస్ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నగదు రహిత చికిత్స అందుబాటులోకి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో లబ్ధిదారులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. అయితే నిమ్స్‌లో ఈహెచ్ఎస్ కౌంటర్ల తొలగింపు వ్యవహారం ఇప్పుడు ఉద్యోగుల్లో కొత్త చర్చకు దారితీసింది. కొత్త విధానం పేరుతో పాత సేవలను పూర్తిగా తొలగించే ముందు ఉద్యోగులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని సంఘాలు చెబుతున్నాయి. ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వృద్ధ పెన్షనర్లు, కుటుంబ సభ్యులకు ప్రత్యక్ష సహాయం అవసరమయ్యే సందర్భాలు ఉంటాయని వారు గుర్తుచేస్తున్నారు. డిజిటల్ వ్యవస్థలపై పూర్తి అవగాహన లేని వారికి ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈహెచ్ఎస్ సేవలు వేగంగా, పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా అందించాలన్నదే వారి ప్రధాన డిమాండ్. మరోవైపు కొత్త ఈహెచ్ఎస్ మార్గదర్శకాలను ఎంపానెల్డ్ ఆస్పత్రులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ కోరుతోంది. చికిత్సలో ఆలస్యం లేకుండా లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందేలా ఆస్పత్రులు వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కాంట్రిబ్యూషన్ తీసుకుంటున్న నేపథ్యంలో వారికి అందాల్సిన ఆరోగ్య సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండకూడదని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. నిమ్స్‌లో తొలగించిన పది ఈహెచ్ఎస్ కౌంటర్ల స్థానంలో ప్రత్యామ్నాయ సదుపాయాలు కల్పిస్తారా, కొత్త డిజిటల్ విధానంతోనే సేవలు అందిస్తారా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ఉద్యోగుల ఆందోళనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని స్పష్టత ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తోంది. కొత్త ఈహెచ్ఎస్ పథకం లక్ష్యం నాణ్యమైన వైద్యం, సులభమైన సేవలు కావడంతో ఆ లక్ష్యానికి అనుగుణంగా నిమ్స్‌లో కూడా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.



## పదవీవిరమణ బాధ్యతకే.. సేవలకు కాదు

- పంచాయతీరాజ్ డీఈ ఇంద్రసేనారెడ్డి సేవలు అభినందనీయం
- ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రభుత్వ ఉద్యోగం కేవలం పదవి మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ డీఈగా పనిచేసిన ఇంద్రసేనారెడ్డి అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. పెద్దఅంబర్‌పేట్‌లో పంచాయతీరాజ్ శాఖ డీఈ ఇంద్రసేనారెడ్డి పదవీవిరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని ఘనంగా సన్మానించి, పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తమకు అప్పగించిన బాధ్యతలను ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వర్తించాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో కీలక బాధ్యతలు చేపట్టిన ఇంద్రసేనారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలులో తన వంతు కృషి చేశారని తెలిపారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత అభినందనీయమన్నారు. పదవీవిరమణ అనేది ఒక బాధ్యతకు మాత్రమే ముగింపు అని, సమాజానికి చేసిన సేవలకు ముగింపు కాదని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. పదవీవిరమణ అనంతరం ఇంద్రసేనారెడ్డి తన కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి,కుటుంబ సభ్యులు తండ్రి బాల్ రెడ్డి, హయత్ నగర్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ చరణ్ రెడ్డి,వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పండ్ల మార్కెట్‌లో వ్యవసాయ విద్యార్థుల అధ్యయనం

- బాటసింగారం మార్కెట్ యార్డును సందర్శించిన అనురాగ్ యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఘట్‌కేసర్‌లోని అనురాగ్ యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా మంగళవారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కొనసాగుతున్న పండ్ల విక్రయాలు, అమ్మకాలు నిర్వహించే విధానం, మార్కెట్ కార్యకలాపాలను విద్యార్థులు పరిశీలించారు. మార్కెట్ యార్డులో పండ్ల విక్రయాలు ఏ విధంగా జరుగుతున్నాయి, వ్యాపార కార్యకలాపాలు ఎలా కొనసాగుతున్నాయి అనే అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించే విధానం, రైతులు పండించిన ఉత్పత్తులు మార్కెట్‌కు చేరిన అనంతరం జరిగే విక్రయ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందారు. అనంతరం విద్యార్థులను గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తన కార్యాలయానికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన మార్కెట్ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతులు, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వారికి వివరించారు. బాటసింగారం పండ్ల మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలతో పాటు మార్కెట్‌లో రైతులు, వ్యాపారులకు అందుతున్న సదుపాయాలు, పండ్ల విక్రయాల నిర్వహణ తదితర అంశాలపై చిలుక మధుసూదన్ రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి మార్కెట్ వ్యవస్థపై అవగాహన కల్పించడంలో ఇటువంటి అధ్యయన పర్యటనలు ఉపయోగపడతాయని తెలిపారు. మార్కెట్‌లో ప్రత్యక్షంగా జరుగుతున్న పండ్ల విక్రయ ప్రక్రియను పరిశీలించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానంపై తమకు మంచి అవగాహన ఏర్పడిందని విద్యార్థులు తెలిపారు. ఈ పర్యటన తమ వ్యవసాయ విద్యకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు.

## ప్రజాసేవలో మరో ముందడుగు

- గ్రీన్ సిటీ కాలనీలో రహదారి సమస్యకు పరిష్కారం..
- రోడ్డు భద్రతకు చర్యలు చేపట్టిన కాలనీ అధ్యక్షుడు బక్కి బాబు గౌడ్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** గ్రీన్ సిటీ కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి కాలనీ అధ్యక్షుడు బక్కి బాబు గౌడ్ ఆధ్వర్యంలో మరో సేవా కార్యక్రమం చేపట్టారు. కాలనీ ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రహదారిని పరిశీలించి, రోడ్డు భద్రతను మెరుగుపరచడంతో పాటు రహదారిపై ఉన్న అడ్డంకులను తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బక్కి బాబు గౌడ్ తెలిపారు. రహదారిపై ఉన్న అడ్డంకుల కారణంగా వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా కాలనీలో రోడ్డు లైన్‌ను సరిచేయడం, రహదారికి ఇబ్బందిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పలు కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం కూడా ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కాలనీ అభివృద్ధితో పాటు ప్రజల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ అందరి సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని బక్కి బాబు గౌడ్ తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ముందుకు రావడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొని పనుల నిర్వహణలో సహకరించారు.

## మొయినాబాద్‌లో జాతీయ స్థాయి పారా క్రీడా పోటీలు



**మొయినాబాద్ సెప్టెంబర్ 1(వి శాలభారతి):** తెలంగాణ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో రెండో ఆల్ ఇండియా పోస్టల్ పారా బ్యాడ్మింటన్, పారా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ మంగళవారం మొయినాబాద్‌లో ప్రారంభమైంది. ఫెయిర్‌ఫాక్స్ స్పోర్ట్స్ అండ్ రిసార్ట్స్‌లో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ పారా అథ్లెట్ దీప్తి జీవాంజి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా 11 పోస్టల్ సర్కిళ్లకు చెందిన సుమారు 60 మంది పారా ఉద్యోగులు, దివ్యాంగ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. పారా బ్యాడ్మింటన్, పారా టేబుల్ టెన్నిస్‌లో పురుషులు, మహిళలకు స్టాండింగ్, వీల్‌చైర్ విభాగాల్లో సింగిల్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 3న జరిగే ముగింపు వేడుకల్లో విజేతలు, పాల్గొన్న క్రీడాకారులను సన్మానించనున్నారు. క్రీడాభిమానులు, విద్యార్థులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలని తెలంగాణ పోస్టల్ శాఖ కోరింది.

# రాహుల్‌పై ఎఫ్ఐఆర్.. బీజేపీ భయానికి నిదర్శనం!

- ప్రశ్నిస్తే కేసులా..? ఇదేనా బీజేపీ ప్రజాస్వామ్యం!
- సామాజిక న్యాయం కోసం ప్రశ్నిస్తే కేసులా..?
- దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఘటనలను నిలదీస్తే ఎఫ్ఐఆర్‌లా..?
- ఇదేనా బీజేపీ చెప్పే ప్రజాస్వామ్యమని ఆయన సూటిగా ప్రశ్నించారు.
- రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్.. బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట
- కేసులతో భయపెట్టాలని చూస్తే భ్రమే..
- ప్రశ్నించే గొంతును అణచివేయడం మీ తరం కాదు!
- ప్రశ్నించే గొంతులను కేసులతో అణచివేయలేరు.
- రాజ్యాంగం కోసం మాట్లాడితే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తారా?
- కేసులతో కాంగ్రెస్ పోరాటాన్ని అడ్డుకోవడం బీజేపీ వల్ల కాదు!
- ప్రజల సమస్యలకు సమాధానం చెప్పలేకే ప్రతిపక్షాలపై కక్షసాధింపు!
- కక్షసాధింపు రాజకీయాలకు కురవి మండలం కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా గోపా నాయక్ ఫైర్.



**కురవి విశాల భారతి:**

ప్రశ్నించే గొంతులను కేసులతో అణచివేయాలని చూస్తున్న బీజేపీ కక్షసాధింపు రాజకీయాలపై కాంగ్రెస్ పార్టీ కురవి మండలం ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా గోపా నాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభ అనంతరం జరిగిన 'శుద్ధీకరణ' ఘటనపై ప్రశ్నించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి బీజేపీ తన రాజకీయ బలాన్ని కాదు.. తన భయాన్ని బయటపెట్టుకుంది" అని భూక్యా గోపా నాయక్ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజ్యాంగం గురించి మాట్లాడితే కేసులా..? సామాజిక న్యాయం కోసం ప్రశ్నిస్తే కేసులా..? దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఘటనలను నిలదీస్తే ఎఫ్ఐఆర్‌లా..? ఇదేనా బీజేపీ చెప్పే ప్రజాస్వామ్యమని ఆయన సూటిగా ప్రశ్నించారు. హల్ద్వానీ ఘటనపై సమగ్ర విచారణ జరపాల్సిన ప్రభుత్వం, అసలు ఘటనను పక్కనపెట్టి ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసు నమోదు చేయడం రాజకీయ ప్రతీకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. నిజంగా బీజేపీకి దళితుల ఆత్మగౌరవంపై చిత్తశుద్ధి ఉంటే, ఘటనకు సంబంధించిన ప్రతి అంశంపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. "ప్రశ్నించిన గొంతుపై కేసు.. అన్యాయాన్ని నిలదీసిన నాయకుడిపై కేసు.. రాజ్యాంగం గురించి మాట్లాడితే ఎఫ్ఐఆర్.. ఇదేనా మీ ప్రజాస్వామ్యం?" అంటూ భూక్యా గోపా నాయక్ బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాహుల్ గాంధీని కేసులతో భయపెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తే అది వారి రాజకీయ భ్రమ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే నాయకుల గొంతును ఎఫ్ఐఆర్‌లతో మూయించడం బీజేపీ తరం కాదన్నారు. "ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా.. రాజ్యాంగ పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ చేసే పోరాటాన్ని ఆపలేరు" అని ఆయన హెచ్చరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలకు సమాధానం చెప్పలేని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టడాన్నే ఆయుధంగా మార్చుకుందని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల, సామాజిక అసమానతలు, దళితులపై జరుగుతున్న అన్యాయాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "కేసులు పెట్టడం బీజేపీ బలం కాదు.. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని బలహీనతకు అది నిదర్శనం" అని భూక్యా గోపా నాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాజకీయ కక్షసాధింపు చర్యలకు బీజేపీ ప్రభుత్వం స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును అణచివేయాలనే ప్రయత్నాలు ఎంత చేసినా కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని, రాజ్యాంగం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తామని భూక్యా గోపా నాయక్ స్పష్టం చేశారు.

## ఢిల్లీ ధర్నాలో తెలంగాణ సీపీఐ నేతలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, దేశంలో మార్పు రావాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో తెలంగాణకు చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 'బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాధవ రెడ్డి, బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యవర్గ సభ్యులు యేశాలి నర్సింహా, పేరాల గోపి, బీటీసీ నాయకులు మంగళపల్లి రవి, సీపీఐ నాయకులు శత్రు నాయక్, ప్రజానాట్య మండలి కళాకారుడు గణేష్ నాయక్ తదితరులు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతం పేరుతో రాజకీయాలు చేస్తూ దేశంలోని అన్ని రంగాలను సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులపై పోలీసుల ద్వారా అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా ఉద్యమాలను అణచివేసే ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం-2020తో దేశ విద్యా వ్యవస్థకు నష్టం కలిగిందని, నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందని వారు విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశంలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాల్సిన అవసరం ఉందని సీపీఐ నేతలు అన్నారు. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన కొనసాగాలంటే దేశంలో మార్పు రావాలని పేర్కొన్నారు. ప్రతి సామాన్యుడికి నివాసం ఉండేందుకు ఇల్లు, తినేందుకు తిండి, కట్టుకునేందుకు బట్ట, జీవనోపాధికి ఉపాధి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు.

## పెన్షన్ విద్రోహ దినంగా సెప్టెంబర్ 1



**రాజేంద్రనగర్, విశాల భారతి:** సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్ ఆర్థిక భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా సంబంధిత జి.ఓ. ప్రతులను దహనం చేసి ప్రభుత్వ విధానాలపై తమ వ్యతిరేకతను తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, ఉద్యోగులకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఓపీఎస్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా "సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్ పునరుద్ధరించాలి", "ఇచ్చిన హామీని అమలు చేయాలి" అంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, అన్ని విశ్వవిద్యాలయాల జాయింట్ సెక్రటరీ జి. పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సాయం.. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం
- వ్యవసాయ భూమి కేటాయింపునకు హామీ



**ములకలపల్లి విశాల భారతి:**

మండలంలోని చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ-శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం చౌటిగూడెం గ్రామానికి చేరుకుని శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు, తక్షణ నష్టపరిహారంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు హామీ ఇచ్చారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఐటీడీఏ ద్వారా అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు, కుటుంబ జీవనోపాధికి కొంతమేర వ్యవసాయ ప్రభుత్వ భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శిరీష మృతిపై ఇప్పటికే సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

## నిరసనకు ముందే అరెస్టులు

- బీజేపీ నేతల ముందస్తు నిర్బంధం.. ప్రజాస్వామ్య హక్కును అడ్డుకున్నారంటూ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆగ్రహం




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి నలుపు రంగు పూయడాన్ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిన ఆందోళన కార్యక్రమానికి వెళ్లకుండా హయత్‌నగర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హాజరుకాకుండా అడ్డుకునే ఉద్దేశంతో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ శ్రేణులను హౌస్ అరెస్ట్ చేసి అనంతరం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ అసహనానికి నిదర్శనమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను ముందస్తుగా నిర్బంధించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. తనను, హయత్‌నగర్ బీజేపీ శ్రేణులను నిర్బంధించినంత మాత్రాన తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. దాడులు, అరెస్టులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజల పక్షాన బీజేపీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హైకోర్ట్ కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు అలిమినేటి నర్సింహా రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, కార్యదర్శి శక్తి సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇట్టబోయిన నర్సింహ, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, నాయకులు వస్పరి వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వృద్ధులను కుటుంబ సభ్యులకు అప్పగింత




**సికింద్రాబాద్, విశాల భారతి :** తప్పిపోయి ఆశ్రయం పొందుతున్న ఇద్దరు మహిళల ఆచూకీ కనుగొని, వారిని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడంలో చిలకలగూడ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆగస్టు 31న చిలకలగూడ పరిధిలో కనిపించిన బాలమణి, గోవిందమ్మలను పోలీసులు తొలుత డ్రీమ్ ఇండియా హోమ్‌లో చేర్పించారు. అనంతరం వారి వివరాలు, ఫోటోల ఆధారంగా పోలీసులు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న గోవిందమ్మ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తగిన వివరాలు అందించి ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. మరోవైపు వికారాబాద్‌కు చెందిన బాలమణి ఫోటోను పత్రికల్లో చూసిన ఆమె కుటుంబ సభ్యులు వెంటనే చిలకలగూడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. వారి గుర్తింపును ధృవీకరించుకున్న పోలీసులు డ్రీమ్ ఇండియా హోమ్ నుంచి బాలమణిని తీసుకొచ్చి బంధువులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ చొరవ తీసుకుని ఇద్దరు మహిళలను వారి కుటుంబాల వద్దకు క్షేమంగా చేర్చారు. తమ వారిని సురక్షితంగా అప్పగించినందుకు బాధితుల కుటుంబ సభ్యులు చిలకలగూడ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

- కార్యాలయంపై దాడిని నిరసిస్తూ ఆందోళనకు సిద్ధమైన నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బీజేపీ కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను హయత్‌నగర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ తోపాటు పలువురు బీజేపీ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గంగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను ముందస్తుగా నిర్బంధించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. తనను, హయత్‌నగర్ బీజేపీ శ్రేణులను నిర్బంధించినంత మాత్రాన తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం, పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ శ్రేణులపై ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని గంగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండారి భాస్కర్,గుండెపు మధు గౌడ్, పిల్లి శ్రీనివాస్ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఎఫ్ఐఆర్‌లతో రాహుల్ గాంధీను ఆపుతామనుకోవడం బీజేపీ భ్రమ!

- **ప్రశ్నించే గొంతులపై కేసులు.. బీజేపీ భయ రాజకీయాలకు నిదర్శనం!**
- **రాజ్యాంగం కోసం మాట్లాడితే ఎఫ్ఐఆర్‌లా..? ఇదేనా మీ ప్రజాస్వామ్యం!**
- **అన్యాయాన్ని నిలదీసిన రాహుల్‌పై కేసు..**
- **బీజేపీపై కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి ధ్వజం**

**మహబూబాబాద్, విశాలభారతి:**



ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం బీజేపీ పాలనలో కొత్త రాజకీయ సంస్కృతిగా మారిందని కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బీజేపీ తన రాజకీయ బలాన్ని చాటుకోలేదని, ప్రశ్నించే గొంతు అంటే తమకు ఎంత భయమో దేశానికి మరోసారి స్పష్టం చేసిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హల్ద్వానీలో జరిగిన ఘటనపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, అసలు అంశంపై విచారణ జరపాల్సిన పాలకులు, ఆ ఘటనను ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసు నమోదు చేయడం ఏమిటని గార్లపాటి వెంకట్ రెడ్డి నిలదీశారు. "ప్రశ్నిస్తే కేసా..? అన్యాయాన్ని నిలదీస్తే ఎఫ్ఐఆరా..? రాజ్యాంగం కోసం మాట్లాడితే నేరమా..? సామాజిక న్యాయం కోసం పోరాడితే శిక్షా..?" అంటూ ఆయన బీజేపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఘటనలపై స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. అసలు ఘటనపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారినే నిందితులుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం బీజేపీ రాజకీయ కక్ష సాధింపుకు నిదర్శనమని మండిపడ్డారు. "రాహుల్ గాంధీపై కేసు పెట్టడం ద్వారా ఆయన గొంతును మూయగలమని బీజేపీ భావిస్తే అంతకంటే పెద్ద రాజకీయ భ్రమ మరొకటి ఉండదు. కేసుల కాగితాలతో ప్రజల గొంతులను బంధించలేరు. ఎఫ్ఐఆర్‌లతో కాంగ్రెస్ పోరాటాన్ని ఆపలేరు" అని గార్లపాటి వెంకట్ రెడ్డి గట్టిగా హెచ్చరించారు. ప్రజల అసలు సమస్యలపై సమాధానం చెప్పలేని పాలకులు ఇప్పుడు ప్రతిపక్షాలపై కేసులు పెట్టడాన్నే తమ రాజకీయ ఆయుధంగా మార్చుకున్నారని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర ధరల భారాలు, సామాజిక అసమానతలు, దళితులపై జరుగుతున్న అన్యాయాలపై సమాధానం చెప్పాల్సిన బీజేపీ ప్రభుత్వం వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. "ప్రజల సమస్యలకు సమాధానం చెప్పే ధైర్యం లేనప్పుడు కేసులు పెట్టడం సులభం. కానీ కేసులు పెట్టడం వల్ల నిజాలు మారవు.. ప్రజల ప్రశ్నలు ఆగవు.. కాంగ్రెస్ పోరాటం వెనక్కి తగ్గదు" అని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాన్ని ఎలాంటి బెదిరింపులు, ఎన్ని కేసులు కూడా ఆపలేవని గార్లపాటి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. "ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఆ హక్కును ఎఫ్ఐఆర్‌లతో అణచివేయాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి. రాజకీయ కక్షసాధింపు చర్యలకు బీజేపీ ప్రభుత్వం స్వస్తి పలకాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## ఇండస్ వ్యాలీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అరవింద్ కుమార్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక



**రాజేంద్రనగర్, విశాల భారతి :** బండ్లగూడ జాగీర్ ఇండస్ వ్యాలీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ (ఐవీహెచ్ఓ) నూతన అధ్యక్షుడిగా అరవింద్ కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి నిర్వహించిన నామినేషన్ ప్రక్రియలో 24 గంటల గడువు ముగిసే సమయానికి అరవింద్ కుమార్ గౌడ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అడ్వైజరీ కమిటీ ప్రకటించింది. అరవింద్ కుమార్ గౌడ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఐవీహెచ్ఓ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ఇండస్ వ్యాలీ కాలనీ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి, భద్రత, పారిశుధ్యం, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కాగా, ఐవీహెచ్ఓ నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక ప్రక్రియను రాబోయే శనివారం లేదా ఆదివారం కాలనీ వాసుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు అడ్వైజరీ కమిటీ తెలిపింది. కార్యవర్గం ఏర్పాటులో కాలనీ నివాసితులందరి భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. కాలనీ అభివృద్ధి, ఐక్యత, భద్రత, సంక్షేమం కోసం ప్రతి నివాసితుడి సహకారం ఎంతో అవసరమని కమిటీ పేర్కొంది. అందరి సమిష్టి భాగస్వామ్యంతో ఐవీహెచ్ఓను మరింత బలోపేతం చేసి, ఇండస్ వ్యాలీ కాలనీ అభివృద్ధికి సమర్థవంతంగా కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేసింది.

## అక్రమ నిర్మాణాలపై నార్సింగి అధికారుల ఉక్కుపాదం

**పుప్పలగూడ నేమలినగర్‌లో 4 భవనాలు.. ఆల్కాపూర్‌లో మరో భవనం కూల్చివేత**





**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై నార్సింగి సర్కిల్-45 అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వరుసగా కూల్చివేత చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సర్కిల్-45 పరిధిలోని పుప్పలగూడ నేమలినగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నాలుగు అక్రమ భవనాలను అధికారులు జేసీబీల సహాయంతో కూల్చివేశారు. అదేవిధంగా నెక్నంపూర్‌లోని ఆల్కాపూర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మరో భవనంపై కూడా కూల్చివేత చర్యలు చేపట్టారు. టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ చర్యలు కొనసాగాయి. మంజూరైన అనుమతులకు భిన్నంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని అధికారులు గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అనుమతి లేకుండా నిర్మించిన అదనపు స్లాబ్‌లను జేసీబీలతో తొలగిస్తున్నారు. ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణాలకు అనుమతులు తీసుకున్న తర్వాత వాటికి విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. భవన నిర్మాణదారులు తప్పనిసరిగా మంజూరైన ప్లాన్, నిబంధనలను పాటించాలని సూచిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్‌ను మరింత ముమ్మరం చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను గుర్తించిన వెంటనే కూల్చివేత చర్యలు చేపడతామని స్పష్టం చేయడంతో ఆల్కాపూర్, పుప్పలగూడ పరిసర ప్రాంతాల్లో నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించవల్సిందే

**జేఏసీ చైర్మన్ యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (TGEJAC), రంగారెడ్డి జిల్లా తరపున, మధ్యాహ్నం భోజన విరామ సమయంలో IDOC, కొంగరకలాన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో IDOC కొంగరకలాన్ లో CPS ను రద్దు చేసి OPS ను పునరుద్దరించాలని అన్నారు. ఈ సందర్భంగా TGEJAC రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ CPS అనేది ఉద్యోగస్తుల పట్ల శాపంగా మారిందని CPS ను వెంటనే రద్దుచేయాలని. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా TGEJAC కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ CPS అనేది చాలా ప్రమాధకరమైనదని ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో CPS రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు దాటవేసే ధోరణి కరెక్ట్ కాదని వెంటనే OPS ను పునరుద్దరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ సంపూర్ణ మద్దతును తెలియజేసారు. OPS పునరుద్ధరణ కోసం మనమంతా ఐక్యంగా నిలబడి, మన గొంతును బలంగా వినిపించాలని అందరు కోరారు.. ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వినర్ శ్రీనేష్ కుమార్ నోరి, కో చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతి శ్రీ, సుధాకర్, రాజేష్, బల్వంత్ రెడ్డి, వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, సెక్రెటరీలు, మాధవ్, ఆనంద్, మహేష్, ప్రమీల, వెంకటప్ప, పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ, అరుణ, గౌస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 మోసాలపై సమరశంఖం

- **నేడు ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ ధర్నా**
- **హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బంటి**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రైతులకు చేసిన మోసాలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10గంటలకు ఇబ్రహీంపట్నంలో భారీ ఎత్తున రైతుల ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కమిటీ ప్రకటించింది. ఈ పోరుబాట కార్యక్రమంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ముఖ్య అతిథులుగా పాల్గొంటారని యాచారం మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని వారు విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలకు గురైన రైతులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాచారం కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లిక్కి నర్సిరెడ్డి, సుభాని, జంగయ్య గౌడ్, కల్లూరి శివ, జుట్టు శ్రీశైలం కాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ చర్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన



**మొయినాబాద్ సెప్టెంబర్ 1(విశాలభారతి):** బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారంటూ ఆరోపిస్తూ మొయినాబాద్ మండల బీజేపీ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ విధ్వంసక చర్యలను ఖండిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, రాష్ట్ర సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ జగపతి, మండల సీనియర్ నాయకులు మోర నర్సింహారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, పద్మనాభం, అశోక్‌యాదవ్, సుధీర్‌యాదవ్, రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాయనోళ్ల రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన




**రాజేంద్రనగర్, విశాల భారతి :** అత్తాపూర్ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ పోలీసులు సూచించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. సీతయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. రాజానాయక్ ఆధ్వర్యంలో సైబర్ వారియర్స్, పెట్రోలింగ్ సిబ్బందితో కలిసి జోయ్ ఆస్పత్రిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోయ్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, మేనేజ్‌మెంట్ సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు, ఆస్పత్రికి వచ్చిన సందర్శకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలపై వివరించారు. ముఖ్యంగా బాస్ స్కామ్‌లు, ఏపీకే ఫైల్ మోసాలు, ఓటీపీ మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, వాట్సాప్ డిజిటల్ అరెస్టులు, మాల్‌వేర్, ఆన్‌లైన్ పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల గురించి అవగాహన కల్పించారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చే నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ లింక్‌లను నమ్మి క్లిక్ చేయవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు సూచించారు. అదేవిధంగా అత్తాపూర్ పోలీసు అధికారులు జెర్మినెటిన్ ఆస్పత్రిలో కూడా మేనేజర్, సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను చాలావరకు అరికట్టవచ్చని పోలీసులు తెలిపారు.

## గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత అల్పాహారం

**విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పథకాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తూ వారి చదువు, పాఠశాలలోని సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉదయాన్నే ఆకలితో పాఠశాలకు వచ్చే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ఉచిత అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పోషకాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నేతల హౌస్ అరెస్ట్‌లు

**సికింద్రాబాద్, విశాల భారతి:** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడికి నిరసనగా మంగళవారం లిబర్టీ చౌరస్తాలో నిర్వహించనున్న నిరసన లో పాల్గొనకుండా ముందస్తుగా బిజెపి నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ముందస్తుగా నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రవి ప్రసాద్ గౌడ్ ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



## అక్రమ అరెస్టులు ప్రభుత్వ దివాళాకోరుతనానికి పరాకాష్ట

**బీజేపీ జిల్లాప్రదాన కార్యదర్శి మేకల సారంగపాణి తీవ్ర ఆగ్రహం**



**సికింద్రాబాద్, విశాలభారతి :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేస్తూ గూండారాజ్‌ను నడుపుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తీవ్రంగా హెచ్చరించారు .కాంగ్రెస్ ప్రభుత్వం తమ 1000 రోజుల పాలనలో ప్రజలకు చేసిన మోసాలు, అన్యాయాలు, పాలనా వైఫల్యాలను బీజేపీ నిలదీసి ఎండగడుతున్నందుకే ఓర్వలేక.. మా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, నాయకులపై ఇలాంటి పిరికిపంద దాడులకు తెగబడుతున్నారని మేకల సారంగపాణి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేట్లకు నల్లరంగు పూసి గూండాగిరీని ప్రదర్శించడమే కాకుండా, నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై ఆయన లేని సమయం చూసి దాడికి పాల్పడటం అత్యంత హేయమైన, పిరికిపంద చర్య. వర్షిత్ రెడ్డి ఇంట్లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తూ, ఆయన తల్లి, మేనమామపై కాంగ్రెస్ రౌడీ మూకలు విచక్షణారహితంగా దాడి చేశాయి. ఈ దాష్టీకం తాలూకు తీవ్ర భయాందోళనల వల్ల వర్షిత్ రెడ్డి గారి తల్లి హఠాత్తుగా గుండెపోటుకు గురై అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. ఇంట్లోని మహిళలు, వృద్ధుల ప్రాణాలతో చెలగాటమాడే స్థాయికి కాంగ్రెస్ పార్టీ దిగజారడం ఆ పార్టీ అరాచక సంస్కృతిని స్పష్టం చేస్తోందని సారంగపాణి తెలిపారు. ఇంతటి దారుణ ఘటన జరిగితే బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. నల్గొండ పర్యటనకు బయలుదేరిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావుని తార్నాక వద్ద పోలీసులు అన్యాయంగా అడ్డుకుని, గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం, అలాగే ముఖ్య నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సిగ్గుచేటు. దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను స్వేచ్ఛగా వదిలేసి, బాధితుల పక్షాన నిలబడే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. దేశంలో రాహుల్ గాంధీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అంటూ నీతులు చెబుతుంటే.. ఇక్కడ రేవంత్ రెడ్డి గూండారాజ్‌తో రాజ్యాంగాన్ని రోడ్డుకీడుస్తూ రౌడీయిజం నడిపిస్తున్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు మేము సూటిగా హెచ్చరిస్తున్నాం... శాంతియుతంగా పోరాడుతున్నంత కాలమే మీ ఆటలు.. బీజేపీ కార్యకర్తలు తిరగబడితే కాంగ్రెస్ నాయకులు, మంత్రులు ప్రజల్లో స్వేచ్ఛగా తిరగలేరని గుర్తుంచుకోవాలి. పోలీసులు ఇప్పటికైనా అధికార పార్టీ తొత్తుల్లా వ్యవహరించడం మానుకోవాలి. వర్షిత్ రెడ్డి కుటుంబంపై, పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే కఠినంగా శిక్షించాలి. అలాగే అక్రమంగా అరెస్టు చేసిన బీజేపీ నాయకులను బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని మేకల సారంగపాణి డిమాండ్ చేశారు.

## దళితుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

- **కులం పేరుతో దూషించి దాడి చేయడం దారుణం**
- **షేక్ అరుణ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి**
- **నీరుడు సామేలు హెచ్చరిక.. లేకుంటే భారీ ఆందోళనలు.**

**కురవి విశాల భారతి:**



కులం పేరుతో దూషించి నిరుపేద దళితుడిపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ అరుణ్‌తో పాటు ఘటనకు సహకరించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామేలు డిమాండ్ చేశారు. కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన బేతమళ్ల జగదీష్ వెల్డింగ్ పని నిమిత్తం ప్రతిరోజూ కురవికి వచ్చి వెళ్తుంటాడని తెలిపారు. ఈ క్రమంలో తోటి కార్మికుడైన షేక్ అరుణ్ తన ఇంటికి పిలిచి, ఎవరూ లేని సమయంలో జగదీష్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు ఆరోపించారు. అంతేకాకుండా కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీరుడు సామేలు మాట్లాడుతూ, కులం పేరుతో దూషించడం, దళితులపై దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. కుల బలం, కండబలం, డబ్బు బలంతో నిరుపేదలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బలహీన వర్గాలపై దాడులకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. బాధితుడు బేతమళ్ల జగదీష్‌కు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఘటనకు సహకరించిన వారిని కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు చేసి తప్పించుకోవచ్చని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమేనని నీరుడు సామేలు తీవ్రంగా హెచ్చరించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయకపోతే తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ, కురవి మండల కమిటీ, తట్టుపల్లి గ్రామ కమిటీతో పాటు ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## వీఆర్ఏ ఉద్యోగం కల్పించి తన కుటుంబానికి న్యాయం చేయాలి

**పలుమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేదు : మాజీ వీఆర్ఓ అందే జంగయ్య**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండలం పరిధిలోని తులేఖుర్దు గ్రామానికి చెందిన మాజీ వీఆర్ఏ అందె జంగయ్య తనకు జరిగిన అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ చిలుకల నరసింహకు వినతిపత్రం అందజేశారు. జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన 1980 నుంచి తులేఖుర్దు గ్రామంలో వీఆర్ఏగా సేవలు అందించారు. 2015లో శస్త్రచికిత్స జరగడంతో నాటి పరిస్థితుల దృష్ట్యా తన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా, 2017లో మండల అధికారుల తప్పిదం వల్ల తనకు 65 ఏళ్లు దాటాయనే నెపంతో అక్రమంగా రిటైర్మెంట్ ఇచ్చారని తెలిపారు. అదే సమయంలో 65 ఏళ్లు దాటిన చింతపట్లకు చెందిన మాదరగోని గత్తరయ్య (89), నందివనపర్తికి చెందిన సామ కృష్ణయ్య (75)తో పాటు మరో ఆరుగురు వీఆర్ఏలు ఇప్పటికీ విధుల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీఓలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తనకు తిరిగి వీఆర్ఏ ఉద్యోగం కల్పించి, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# అనారోగ్యంతో ఉన్న బాలికను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**



**కురవి విశాల భారతి:** కురవి మండలం నేరడ గ్రామంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న బాలికను పరామర్శించడంతో పాటు ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేరడ గ్రామానికి చెందిన నీలం నాగరాజు కుమార్తె జ్వరంతో అస్వస్థతకు గురై ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సంరక్షణ పొందాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మొగిలిచర్ల రామచంద్రయ్య ఇటీవల మృతి చెందడంతో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల స్వర్గస్తులైన ముక్కెర లచ్చయ్య, ఇరుగు ఉప్పలయ్య చిత్రపటాలకు పూలతో నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గుగులోతు రవి నాయక్, మాజీ సర్పంచ్ గుండోజు శ్రీనివాస్, మల్లెపాక మధు, మంద కృష్ణ, కొండబత్తుల రవీందర్, కుదురుపాక చొక్కయ్య, నీలం నాగరాజు, వార్డు సభ్యులు కుదురుపాక వెంకన్న, మదూరి యాకన్న, ఫాతిమా అక్బర్, జక్కుల రమేష్, సాదిక్, సైజ్ జాన్, ముజీబ్, చెలగొల్ల రవి, జక్కుల లింగన్న, దుస్స రాజు, ఎస్కే హుసేన్, బిక్షపతి, అక్బర్, రుద్రరపు వీరన్న, బేతమల్ల మొగిలి, అజయ్, రామన్న, లచ్చన్న, షరీఫ్, నవీన్, ఎస్కే అఫ్జల్, కొండబత్తుల నారాయణ, నిరుదు సత్యప్రసాద్ తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాయపడిన ఇస్లావత్ బుల్లిని పరామర్శ

- **టీపీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ సెల్ వీరన్న నాయక్**
- **కురవి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య గోపా నాయక్**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండాకు చెందిన ఇస్లావత్ బుల్లి (వెంకన్న భార్య) ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాళ్లు, చేతులు విరగడంతో మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ సెల్ వీరన్న నాయక్, కురవి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య గోపా నాయక్‌లు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఇస్లావత్ బుల్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు, ఆమెకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అనంతరం బాధితురాలికి ధైర్యం చెప్పిన డాక్టర్ సెల్ వీరన్న నాయక్, భూక్య గోపా నాయక్‌లు ఆమెకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్పల తండా సర్పంచ్ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ పునరుద్ధరించాలని నిరసన



**కోదాడ, విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) పిలుపులో భాగంగా కోదాడ పట్టణంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. 'సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం (ఆర్డీఓ ఆఫీస్) ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సామాజిక భద్రతను దెబ్బతీసే నూతన పెన్షన్ విధానం వల్ల పదవీ విరమణ తర్వాత జీవితం దుర్భరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ అయిన పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కోదాడ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులతో పాటు పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొని మద్దతు తెలిపారు.

# ఆరెగూడెంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ జి. మన్మధ కుమార్**



**చౌటుప్పల్, విశాల భారతి:** నిత్యం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్ గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు, ఓటీపీ, పిన్, సీవీవీ, యుపిఐ పిన్ వంటి వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. కెవైసి అప్‌డేట్, లోన్, ఉద్యోగం, లాటరీ, రివార్డ్ పాయింట్లు, డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ పేర్లతో జరుగుతున్న నూతన తరహా ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని తెలిపారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత ఫోటోలు, సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే ఆధారాలను భద్రపరచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పోలీస్ సిబ్బంది, ఆరెగూడెం గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

# ప్రీతమ్‌ను పరామర్శించిన గద్దల రమేష్



**పాల్వంచ విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ నాగరిగారి ప్రీతమ్ తల్లి నాగరిగారి వసంత రాణి అకాల మరణం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని చెంగిచెర్లలో ఉన్న ప్రీతమ్ స్వగృహానికి వెళ్లిన గద్దల రమేష్, ప్రీతమ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వసంత రాణి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పాల్వంచ టౌన్ ప్రెసిడెంట్ సదాశివ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఊకె శిరీషను హతమార్చిన వాడిని ఉరి తీయాలి

- **మదర్ తెరిసా కాలేజీలో ఏర్పాటు చేసిన సెమినార్ లో మాట్లాడుతున్న**
- **ఆదివాసి సంఘాల చేసి నాయకులు తెల్లం రామయ్య**
- **ఆదివాసి మహిళ రాష్ట్ర అధ్యక్షులు కుంజా రమాదేవి**

**భద్రాచలం: విశాల భారతి;**



హైదరాబాద్ తుక్కుగూడ లో ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సింగ్ చేస్తున్న ఊకె శిరీష ను అతికిరాతకంగా చంపిన వ్యక్తిని తక్షణమే ఉరితీయాలని ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు తెల్లం రమణయ్య అలాగే కుంజా రమాదేవి డిమాండ్ చేశారు. మదర్ తెరిసా కాలేజీలో ఏర్పాటు చేసిన సెమినార్లో వారు మాట్లాడుతూ... ఉద్యోగం రీత్యా ఆదివాసి బిడ్డ శిరీష హైదరాబాదులోని తుక్కుగూడ లో ప్రైవేట్ నర్సింగ్ హోమ్ ఉద్యోగం నిర్వహిస్తుండగ కొంతకాలంగా కాపుగాసిన కామాంధుడు శిరీషను అతి కిరాతకంగా మానభంగం చేసి హత్య చేశాడని అటువంటి దుర్మార్గున్ని సభ్య సమాజం ఉరితీయాలని నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంఘటనపై సరైన రీతులో స్పందించలేదని వారు ఆవేదన చెందారు. జరిగిన సంఘటనపై నిందితుడు తానంతటక తానే లొంగిపోయితే క్షమిస్తారా అని వారు ప్రశ్నించారు తక్షణమే ఎన్కౌంటర్ చేయాలని లేదంటే ఆదివాసుల ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. శిరీష మరణం పట్ల ప్రతి ఒక్కరు స్పందించాలని ఇటువంటి సంఘటనలు జరగకుండా భద్రత కల్పించాలని ఆదివాసి బిడ్డను పొట్టను పెట్టుకున్న దుర్మార్గున్ని వదలొద్దని వాళ్ళు హితవు పలికారు. రేవంత్ రెడ్డి తక్షణమే ఈ విషయంపై స్పందించి ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన నిందితున్ని తక్షణమే ఎన్కౌంటర్ చేయాలని అలాగే అన్యం పుణ్యం ఎరుగని శిరీష మరణానికి సంతాపం ప్రకటించాలని వారి కుటుంబానికి 5 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని జరుగుతున్న అన్యాయం పైన తిరుగుబాటు చేయాలని ప్రభుత్వాలు కూడా సరైనటువంటి రక్షణ కల్పించాలని వారు అన్నారు ఈ సెమినార్ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు కంగాల రమణకుమారి,. శీలం దుర్గ, కొండ్రు సుధారాణి, కనితి రాధా, కమల , ఎక్స్ ఎంపీపీ మంజు భార్గవి , దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ తనిఖీ

- **కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణపై సమీక్ష**
- **ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎల్‌బీ నగర్ డీసీపీ బి. అనూరాధ, ఐపీఎస్ నాగోల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, వివిధ విభాగాల పనితీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అందుతున్న సేవలపై కూడా వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన డీసీపీ.. కేసుల నమోదు, దర్యాప్తు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలపై అధికారులతో సమీక్షించారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా దర్యాప్తు చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందితో డీసీపీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించారు. విధుల్లో క్రమశిక్షణను పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం కలిగేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీసీపీ బి. అనూరాధ సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను సానుభూతితో విని, నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటూ, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని డీసీపీ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను అధికారులకు, సిబ్బందికి అందించారు.

# బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల కోసం జేఏసీ,డియస్పి పోరాటం

**ఎర్రోళ్ల శాంతి కుమార్ డియస్పి జిల్లా అధ్యక్షులు**



**చౌటుప్పల్,విశాలభారతి:** తెలంగాణలో పెండింగ్ లో ఉన్న 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు చౌటుప్పల్ మండలంలో బీసీ,యస్సి యస్ టీ,జేఏసీ మరియు డియస్పి సంయుక్త కమిటీల ఆధ్వర్యంలో ఎంఆర్ఓ కి వినతి పత్రం అందజేశారు. డియస్పి జిల్లా కార్యదర్శి బి ఆర్ సాయి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డియస్పి జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల శాంతి కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయన్నారు. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులు తమ చదువులను కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని, ఈ ప్రభావం రాష్ట్రంలో దాదాపు కోటి కుటుంబాలపై పడుతుందని తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, పేద విద్యార్థులు ఎటువంటి ఆటంకం లేకుండా విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డియస్పి జిల్లా ఉపాధ్యక్షులు జలందర్, జేఏసీ జిల్లా నాయకులు చెక్క కిరణ్ ముదిరాజ్, నాయకులు జోగు నర్సింగ్, యంజాల శ్రీకాంత్, చెక్క సాయి కుమార్, భట్టు సాయి, బోయ కుమార్, జోగు స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ యువతి శిరీషపై దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

- **నిందితుడికి కఠిన శిక్ష విధించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి**
- **సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ డిమాండ్**



**మహబూబాబాద్ జిల్లా బయ్యారం విశాల భారతి;** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసీ యువతి ఉకే శిరీషపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ తెలిపారు. ఉన్నత చదువులు అభ్యసించి గిరిజన ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వెళ్లి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ యువతి శిరీషపై జరిగిన ఘటన అత్యంత దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు, ముఖ్యంగా ఆదివాసీ యువతులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అమానవీయ ఘటనకు బాధ్యుడైన నిందితుడు షాన్ ఉల్లా ఖాన్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భూక్య రవి నాయక్ కోరారు. ఆదివాసీ బిడ్డకు న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా నిలిచి పోరాడుతామని స్పష్టం చేశారు. ఆదివాసీ యువతి శిరీషకు న్యాయం చేయాలని, నిందితుడికి కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీర శ్రీకాంత్ నాయక్, జాటోత్ రవి నాయక్, అజ్మీర కళ్యాణ్ నాయక్, భూక్య మోహన్ నాయక్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**10 వేల మంది యాదవ కుటుంబ సభ్యులతో భారీ ర్యాలీ**

**జనగామ జిల్లా విశాల భారతి**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని జనగామ పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా శ్రీకృష్ణ యాదవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నెహ్రూ పార్క్ నుంచి బతుకమ్మ కుంట వరకు సుమారు 10 వేల మంది యాదవ కుటుంబ సభ్యులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో శ్రీకృష్ణ రథం, యాదవ డోలు విన్యాసాలు, యాదవ కుటుంబ సభ్యుల కోలాట బృందాల ప్రదర్శనలు, యాదవ కళాకారుల ఆటపాట కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అనంతరం బతుకమ్మ కుంట వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణ, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే వల్లాల నవీన్ కుమార్ యాదవ్, యాదగిరిగుట్ట దేవస్థానం సభ్యురాలు పోచరబోయిన ఈశ్వరమ్మ యాదవ్ తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జనగామ జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి యాదవ కుటుంబ సభ్యులు కుటుంబ సమేతంగా తరలివచ్చి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కానుగంటి ముత్తయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి పాండు కృష్ణ యాదవ్, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజు యాదవ్, దండబోయిన హరిప్రసాద్ యాదవ్, శోభనబోయిన శివరాజ్ యాదవ్, వారాల రమేష్ యాదవ్, చిలువేరు కృష్ణమూర్తి యాదవ్, సుడిగెల హనుమంతు యాదవ్, మేకల రమేష్ యాదవ్, జక్కుల గంగరాజు యాదవ్, మేకల నందు యాదవ్‌తో పాటు యాదవ సోదరులు, సోదరీమణులు, యువత, చిన్నారులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వానించడం జరిగింది.

# పద్మశాలి సమాజ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



**మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట విశాల భారతి ):** పద్మశాలి సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ అన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంలో నిర్వహించిన పద్మశాలి సంఘం జనరల్ బాడీ సమావేశానికి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పద్మశాలి సంఘం అభివృద్ధి, సమాజ సంక్షేమం, సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. పద్మశాలి సమాజానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం తరఫున తనవంతు కృషి చేస్తానని డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ఐక్యంగా ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సి పి యస్ విధానం రద్దు చేసి ఓ పి యస్ పథకాన్ని పునరుద్ధరించాలి



**టి జి ఈ జాక్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన**

**మోతె సెప్టెంబర్ 1 విశాల భారతి :** మంగళవారం మండల కేంద్రంలో టి జి ఈ జాక్ పిలుపు మేరకు సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినం పాటిస్తూ మండలంలోని అన్ని పాఠశాలలు, కార్యాలయాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయడం జరిగింది. మండల కేంద్రంలో పాఠశాల ముగింపు అనంతరం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టి జి ఈ జాక్ జిల్లా నాయకులు డి. లాలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే సిపిఎస్ విధానం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని, ప్రజా ప్రతినిధులు యం యల్ ఏ, యం యల్ సి, యం పి గా ఒక్కసారి ఎన్నికైతే జీవితాంతం పెన్షన్ పొందుతున్నప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయులు 30 నుంచి 35 సంవత్సరాలు ప్రజా సేవలో ఉండి రిటైర్మెంట్ పొందితే పెన్షన్ లేకుండా చేయడం చాలా అన్యాయమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్ణయం తీసుకొని పి.ఎఫ్. ఆర్. డి .ఏ. చట్టం రద్దుచేసి, సిపిఎస్ విధానం లేకుండా తొలగించాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పెన్షన్ వచ్చేలాగా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించకపోతే సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి జి ఈ జాక్ మండల నాయకులు డి. నరేందర్, ఆర్. నాగయ్య, వీరాంజనేయులు, ఎల్. ఆనంద్ కిషోర్, పరమేష్, శ్రీను, యాదయ్య, లక్ష్మీ కామేశ్వరి, కవిత, రేణుక, విజయకుమారి, రాములు, షాజాది, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్, కృపాని, ప్రసాద్, గురులక్ష్మీ, లకుపతి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

**తహసీల్దార్ యం వెంకన్న**



**మోతె సెప్టెంబర్ 1 విశాల భారతి :** మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్యాలయ సిబ్బంది టి జి ఈ జాక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ యం వెంకన్న మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు సి పి యస్ తొ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఉద్యోగులు కట్టిన డబ్బులను ఇచ్చి చేతులు దులుపుకోవడమేనని పాత పెన్షన్ విధానం తొ ప్రతి నెల నెల వస్తుందని ఉద్యోగులను కాపాడిన ప్రజా పాలన ప్రభుత్వానికి ఉద్యోగులు అండగా ఉంటామని చెప్పారు ఈ కార్యక్రమం లొ రెవిన్యూ సిబ్బంది నల్ల రిబ్బన్ లు ధరించి ప్ల కార్డులు పట్టుకొని నిరసన చేపట్టారు ఈ కార్యక్రమంలో డి టి పుష్ప ఆర్ ఐ లు రమేష్ కర్ణాకర్ రెడ్డి సీనియర్ అసిస్టెంట్ సుజిత్ టి జి పి ఓ స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సైదులు ఏ యస్ ఓ శ్రీనివాస్ రెడ్డి జూనియర్ అసిస్టెంట్ రూప ఉపేంద్ర జి పి ఓ లు పల్లవి శైలజ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

- గంగిడి మనోహర్ రెడ్డి బిజెపి రాష్ట్ర నాయకులు
- కడారి కల్పన ఐలయ్య యాదవ్ బిజెపి పట్టణ అధ్యక్షులు



**చౌటుప్పల్, విశాలభారతి:** నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయం మరియు జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడిని ఖండిస్తూ చౌటుప్పల్ లో బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ చౌరస్తాలో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ నాయకత్వం వహించారు. సోమవారం నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంపై రాళ్ల దాడి జరిగి ఫర్నిచర్ ధ్వంసమైందని, అదే సమయంలో జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి ఇంటిపై దాడి చేసి కుటుంబ సభ్యులపై దాడి చేసి టీవీ, ఫ్రిజ్ తదితర వస్తువులు ధ్వంసం చేశారని బీజేపీ ఆరోపించింది. పోలీసుల కథనం ప్రకారం, హైదరాబాద్ లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నల్ల పెయింట్ చల్లడం, ఆ తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ క్యాంపు కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు నిరసన తెలపడంతో పరస్పర ఉద్రిక్తతలు పెరిగాయి. ప్రస్తుతం ఇరు కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాలపై కాంగ్రెస్ దాడులకు పాల్పడుతోందని, ఈ అప్రజాస్వామిక వైఖరిని మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం చెబుతారని నాయకులు అన్నారు. ఈ నిరసనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి, ఉబ్బు బిక్షపతి, బాతరాజు సత్యం, కౌన్సిలర్లు బుడ్డా సురేష్, పోలపల్లి లక్ష్మి తదితర బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం




**మునగాల, విశాలభారతి:** కోదాడ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతలు, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి గార్లపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన విమర్శలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. మునగాల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే సామేలు ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన సమావేశం నిర్వహించారు. ఇటీవల కోదాడలో జరిగిన కనకమ్మ డబ్బా కొట్టు వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్య ప్రవర్తించిన తీరును ఈ సందర్భంగా వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే సామేలు మాట్లాడుతూ.. కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఉత్తంకుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి దంపతులను విమర్శించే స్థాయి బొల్లం మల్లయ్యకు లేదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, ఒక చిన్న డబ్బా కొట్టు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకొని మల్లయ్య చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఆయనకు బుద్ధి మారలేదని విమర్శించారు. కోదాడ నియోజకవర్గంలో ఇకనైనా ఇటువంటి వెకిలి చేష్టలు మానుకోవాలని, లేదంటే ప్రతి గ్రామంలో ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమని హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మునగాల మండల అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్లయ్య తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల కేంద్రాలతో పాటు డివిజన్ కేంద్రాలలో కూడా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు ఆయనను అడ్డుకుంటారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, బత్తిని లక్ష్మీనారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాయి, పాషా, నాగయ్య, వెంకన్న, చిన్న, ప్రవీణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక...

**అధ్యక్షులుగా కొడారి వెంకటేశ్వర్లు .. కార్యదర్శిగా త్రిపురారి నెహ్రూ .. కోశాధికారిగా ఎస్కే ఖదీర్**



**అశ్వాపురం, విశాల భారతి :** అశ్వాపురం మండలం నవ చైతన్య నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా కుందూరు శ్రీనివాస్ రెడ్డి, గౌరవ సలహాదారుగా తునికేసి సురేందర్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా కొడారి వెంకటేశ్వర్లు, త్రిపురారి నెహ్రూ, ఉపాధ్యక్షులుగా కత్తెరం వెంకటరమణారెడ్డి, పగడాల వెంకట్ రెడ్డి, కోశాధికారిగా ఎస్కే ఖదీర్, సహాయ కార్యదర్శులు గా గరికపాటి అంజన రావు, అప్పన మురళి, ప్రచార కార్యదర్శిగా దీపంగి వెంకటరమణ సభ్యులుగా మండల విజయ్ కుమార్ కుమార్, కానూరి రాంబాబు, అలవాల నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అపరిస్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఏజెన్సీ మండలం కావడంతో విలేకరులకు గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్ల స్థలాలను ప్రభుత్వం ఇవ్వలేదని, ఈ సమస్యపై కలిసివచ్చే సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. అదే విధంగా ప్రైవేటు విద్యాలయాల్లో అక్రిడేషన్ జర్నలిస్టుల పిల్లలతో పాటు వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు కూడా ఉచిత విద్యను అందించేలా సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి విలేకరులకు మేలు చేకూరేలా చేస్తామన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి, అర్హులైన వారికి జీవన ఉపాధి కల్పించేందుకు జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి ఆర్థికంగా సహాయం చేసేలా కార్యాచరణను సిద్ధం చేసుకుని విడతల వారీగా ప్రభుత్వ అధికారులకు వినతులు అందజేస్తామన్నారు. నవ చైతన్య ప్రెస్ క్లబ్ లోనూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆశ భావం వ్యక్తం చేశారు.

# కొత్తగూడెం పట్టణం లో GO : 76ను వెంటనే అమలు చేయాలి

- బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**కొత్తగూడెం విశాల భారతి:** పట్టణం బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం దగ్గర బస్టాండ్ సెంటర్లో GO : 76ను వెంటనే అమలు చేసి, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ వద్ద ఒకరోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికైనా స్పందించాలని స్పందించాలని జీవో నెంబర్ 76 అర్హులైన పేదలందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని పలికారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మొద్దు నిద్రలో ఉన్న ఎమ్మెల్యే వెంటనే మేల్కొని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ముందుగా కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేసిన అనంతరం ఢిల్లీలో బీజేపీపై పోరాటాలు చేయాలని పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ సూచించారు. ప్రజలకు సంబంధించిన GO : 76ను వెంటనే అమలు చేయాలని, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో జిల్లా నాయకులు సీతారాముల నాయక్, ఆకుల నాగేశ్వరరావు గౌడ్, పోనీశెట్టి వెంకటేశ్వర్లు, నోముల రమేష్,రాయుడు నాగేశ్వరరావు,ఆదిమూల రాములు, కనుకుంట్ల రాజమౌళి, భూఖ్య రాజేష్,తెలంగాణ క్రాంతి,సంపత్ గౌడ్,తెల్లం. నర్సింహా రావు మాలోత్ గాంధీ, కొత్తూరు శ్రీనివాస్, నరసింహారావు దొర , మహిళా నాయకురాలు భూక్యా పూర్ణ, అలివేలు, బొందుగుల యామిని, హాసిని,పట్టణ ప్రధాన కార్యదర్శిలు చంద్రగిరి రమేష్, కలంకార రాజశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ , భాస్కర్ గౌడ్,రవి,గిరి నరసింహులుతదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ‘మైసా’ విడుదల అప్పుడే..

గిరిజన వీరనారిగా అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా యాక్షన్ డ్రామా ‘మైసా’. రవీంద్ర పుల్లె దర్శకుడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌ని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ‘మైసా’ విడుదల కానున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో.. ఒక పెద్ద ఈటె పట్టుకుని, శరీరంపై యుద్ధ గాయాలతో నిలబడి ఉన్న రష్మికను చూడొచ్చు. ఇది యాక్షన్‌తో కూడిన పీరియడ్ డ్రామా అని ఈ స్టిల్ చెబుతున్నది. ‘ఉత్కంఠ భరితమైన పోరాటాలతో ఓ బెంచ్ మార్క్‌ని క్రియేట్ చేసేలా ఈ సినిమా రూపొందుతున్నది. అద్భుతమైన వీఎఫ్ఎక్స్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం రష్మిక అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇటీవలే యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె గాయపడ్డ విషయం తెలిసిందే. గాయం నయం కాగానే తిరిగి షూటింగ్‌లో పాల్గొని చివరి దశ షూటింగ్‌ని పూర్తి చేస్తారు. ఇంకా 12రోజుల షూటింగ్ మాత్రమే మిగిలివున్నది’ అని మేకర్స్ తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.